



కార్తీకం..ఆరంభం

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరి నదీతీరం కార్తీక పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. బుధవారం వేకువజామున 2:30 గంటల నుంచి భక్తులు పెద్దఎత్తున నగరంలో పుష్కరాల రేవు, కోటిలింగాల రేవు, పద్మావతి ఘాట్, టీటీడీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, కొవ్వూరు ఘాట్‌లలో భక్తులు గోదావరి స్నానాలు ఆచరించారు. కుటుంబాలతో రేవులకు చేరుకుని భక్తిశ్రద్ధలతో స్నానాలు చేశారు. అటుపై రేవులో పిండిముగ్గు వేసి దానిలో పసుపు, కుంకుమ దిద్ది, తమలపాకులో పసుపుముద్దతో దేవుడి ప్రతిమ చేసుకుని పిండి ప్రమిదల్లో దీపం వెలిగించుకుని మహిళలు పూజ చేశారు. కార్తీక దీపాలను గోదావరినదిలో విడిచి పెట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో రేవులన్నీ కిక్కిరిశాయి. భక్తజనం రేవులు సమీపంలోని దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద, నందీశ్వరుడి వద్ద దీపాలు వెలిగించారు. జిల్లా వ్యాప్తంగా శివాలయా లు కార్తీక శోభతో ప్రజ్వరిల్లాయి. ధవళేశ్వరం రామపాదాల రేవు భక్తులతో కిటకిటలాడింది.



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద భక్తుల రద్దీ.. కార్తీక దీపాలతో దంపతులు



ఆర నీకుమా..ఈ దీపం



కాటేసిన
కామాంధులు!

కామాతురాణాం నభయం..నలజ్జ..
కామంతో కళ్లు మూసుకుపోయిన
వాడికి సిగ్గు ఉండదు.. భయం ఉండదు..
ప్రస్తుతం సమాజంలో పరిస్థితి అలాగే
ఉంది.. వావి వరుసలు మర్చిపోతున్నారు.. కామాంధులైపోతున్నారు..
రాజమహేంద్రవరం, తునిలో జరిగిన
రెండు ఘటనలే అందుకు ఉదాహరణ.
ఒకడు అన్నను అంటూ హాస్టల్ వార్డెన్‌కి
మాయమాటలు చెప్పి బాలికను
తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు..
మరొకడు తాతయ్యను అంటూ
బాలికకు మాయమాటలు చెప్పి
అత్యాచారానికి పాల్పడ్డాడు..
ఈ రెండు ఘటనలు సమాజంలో
బాలికల రక్షణను ప్రశ్నిస్తున్నాయి..

7

మూడేనా!



ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఇంకా ఏడాదే

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో జడ్పీ విభజనకు సమయం ముంచుకొస్తోంది. వచ్చే ఏడాది నాటికి మూడు జిల్లాలకు మూడు జిల్లా పరిషత్‌లు ఏర్పాటు కాబోతున్నాయి. ప్రస్తుత ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఏడాది మాత్రమే కాల వ్యవధి మిగిలి ఉండడంతో కొత్త జడ్పీల ఏర్పాటుపై తాజాగా ఉద్యోగ వర్గాల్లో చర్చ మొదలైంది. గత నెలతో ఉమ్మడి జిల్లా పరిషత్‌కు నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయింది.మిగిలిన ఏడాది కాలానికి ఆరు నెలల ముందే ఎన్నికలు జరిగే అవకా శాలు కనిపిస్తున్నాయి. దీంతో తాజాగా అధికారులు విభజిత జిల్లాల ఆధారంగా ఓటర్ల జాబితా విభజనపై దృష్టిసారించారు.అటు ప్రభుత్వం సైతం రెగ్యులర్ పోస్టుల భర్తీ చేపడుతుండగా, మరో పక్క జడ్పీ ఆస్తుల లెక్క తేలిపోయింది.

మూడింటికి మూడు..

11 నెలల్లో కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలకు మూడు జడ్పీలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలో జిల్లా పరిషత్‌లకు 2021 లో ఎన్నికలు జరగ్గా సెప్టెంబరులో ఫలితాలు విడుదలయ్యాయి. దీంతో గత నెలలో ముగిసిన సెప్టెంబరుతో వీటికి నాలుగేళ్ల పదవీకాలం పూర్తయింది. అయితే జిల్లా పరిషత్‌లకు కొత్త పాలకవర్గాలకు ఏర్పడిన ఏడాది తర్వాత రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. అయితే న్యాయపరమైన చిక్కుల కారణంగా విభజిత జిల్లాలకు సైతం ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీనే కొనసాగించారు. దీంతో ఇప్పటికీ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే జిల్లా పరిషత్ సమావేశాలు జరుగుతున్నాయి. మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులు హాజరవుతున్నారు. ప్రస్తుత జడ్పీకి వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి ఐదేళ్ల పదవీ కాలం పూర్తికానుంది. దీంతో తదుపరి జరిగే జిల్లా పరిషత్ ఎన్నికలు మూడు కొత్త జడ్పీలు విభజించి నిర్వహించాల్సి ఉంది. త్వరలో జరగనున్న పంచాయతీలు, మునిసిపాలిటీలతో పాటే జడ్పీలకు ఎన్నికలు జరగొచ్చనే చర్చ జరుగుతోంది. దీనిపై ఎడతెగని చర్చ జరుగుతోంది. ఏడాదికంటే ముందుగానే ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న రాజధాని అధికారుల సంకేతాలతో ప్రస్తుతం జిల్లా పరిషత్ అధికారులు మూడు కొత్త జడ్పీల ఏర్పాటు, విభజిత జిల్లాల ప్రకారం ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంపై దృష్టిసారించారు.ఆరు నెలల్లో మూడు కొత్త జడ్పీలను ఏర్పాటు చేసే కసరత్తు పుంజుకోనుంది.

వాటిపై స్పష్టత ఎలాగో..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిషత్‌లో 62 మంది జడ్పీటీసీలు, 997 మంది ఎంపీటీసీలు ఉన్నారు.మూడు జిల్లాలకు సంబంధించి ఆయా మండలాల ప్రకారం ఏ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఏ జిల్లా పరిధిలోకి వస్తారనే దానిపై స్పష్టత ఉండడంతో దాని ప్రకారం అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమైన ఓటర్ల జాబితాను మండలాలవారీగా విభజించనున్నారు. గత వైసీపీ సర్కారు హయాంలో జిల్లాల విభజన గందరగోళంగా జరగడంతో ఇప్పటికీ వీటిపై ప్రజలనుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం విభజిత జిల్లాలపై వస్తోన్న అభ్యంతరాలపై మార్పులు చేర్పులు చేయడానికి ఇప్పటికే మంత్రులతో కమిటీని నియమించింది. ఇందులో భాగంగా కోనసీమ జిల్లాలోని మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని వినతులు వెల్లువెత్తాయి. రామచంద్రపురం నియోజకవర్గం మొత్తాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. కాజులూరు మండలం కాకినాడ జిల్లాలో ఉండడాన్ని గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమలను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. జిల్లాల విభజనలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గాన్ని ఉమ్మడి విశాఖ పరిధిలోని పాడేరు డివిజన్‌లో కలిపి అల్లూరి జిల్లాగా మార్చారు. ఈ నేపథ్యంలో రంపచోడవరంలోని 11 జడ్పీటీసీలు, ఇతర ఎంపీటీసీలను అల్లూరి జిల్లాలో కలపొద్దనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. లేదంటే తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సర్దుబాట్లు ఎలా ఉంటాయనేదాని ఆధారంగా కొత్త జడ్పీల ఏర్పాటు తుది రూపు సంతరించుకోనుంది.

ఆ మూడూ ఇటే..

ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలు తూర్పుగోదావరి జిల్లాకు కొత్తగా ఏర్పడే జిల్లా పరిషత్‌లోకి చేరనున్నాయి. ప్రస్తుతం జడ్పీలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కొనసాగుతున్న నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న నిడదవోలు,కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలోని జడ్పీటీసీలు ఏలూరులో జరిగే జడ్పీ సమావేశాలకు వ్యయప్రయాసలకోర్చి వెళ్లాల్సి వస్తోంది. అదే కొత్త జడ్పీలు ఏర్పడిన తర్వాత ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో జడ్పీటీసీలు రాజమహేంద్రవరంలో జరిగే జడ్పీ సమావేశాలకు హాజరవుతారు.ప్రధానంగా కొవ్వూరు,నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి విభజిత జిల్లాల ప్రకారం ఏర్పడే రాజమహేం ద్రవ రం జిల్లా పరిషత్‌లో ఈ మూడు నియోజక వర్గాల నుంచి పది మంది జడ్పీటీసీలు చేరనున్నారు.

- ఆరునెలల ముందే ఎన్నికలు?
- ముగిసిన నాలుగేళ్ల పదవీకాలం
- మూడు జిల్లాలకు మూడు జడ్పీలు
- వచ్చే ఏడాది నుంచి ముక్కలు
- విభజిత జిల్లాల్లో సర్దుబాట్లు
- పశ్చిమ నుంచి 10 జడ్పీటీసీలు
- ఓటర్ల జాబితాలపై కుస్తీ
- ఎంపీడీవోలు, రెగ్యులర్ పోస్టుల భర్తీ
- ఇప్పటికే జడ్పీ ఆస్తుల విభజనపూర్తి
- ఆదాయాలపై నివేదికలు సిద్ధం

కసరత్తు వేగంగానే..

కొత్తగా మూడు జడ్పీల ఏర్పాటుకు సంబంధించి అంతర్గతంగా అధికారులు కసరత్తు ఆరంభించారు. వీటికి కూడా ఆరునెలలోపే అంటే జూలైలోగా ఎన్నికలు ఉండొచ్చని పైస్థాయి నుంచి సంకేతాలు అందడంతో ఓటర్ల జాబితాతో పాటు ఆయా మండలాల్లో రెగ్యులర్ ఎంపీడీవోలను భర్తీ చేస్తున్నారు. జడ్పీ ఎన్నికల నిర్వహణలో ఎంపీడీవోల పాత్ర కీలకం కావడంతో ఈ దిశగా ఇప్పటికే నియామకాలు జరుగుతున్నాయి. సిబ్బంది సర్దుబాటుపైనా అధికారులు దృష్టిసారించారు.ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఉన్న ఆస్తులు ఎంతనేది ఇప్పటికే లెక్క తేల్చారు.మూడు జిల్లాల్లో ఎక్కడిక క్కడ జడ్పీకి భవనాలు,అద్దెల రూపంలో వచ్చే ఆదాయం ,స్థలాలు గుర్తించి నివేదికలు సిద్ధం చేశారు.

రాజ్యాంగంపై పోటీలు

జిల్లా నుంచి అసెంబ్లీ వీక్షణకు ముగ్గురు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది జిల్లాలోని ముగ్గురు విద్యార్థులకు అరుదైన అవకాశం దక్కనుంది. రాష్ట్ర శాసనసభ, పనితీరు, కార్యక్రమాలను వీక్షించడానికి అమరావతి వెళ్లనున్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు కసరత్తు ఆరంభించారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతులు భవిష్యత్తుకు కీలకమలుపుగా చెబుతారు. దీంతో ఆ స్థాయి నుంచే రాజ్యాంగం గురించి తెలియజేయాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం సంకల్పించింది.జిల్లాలో ఆ మూడు తరగతుల్లో సుమారు 60వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు రాజ్యాంగంపై వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలను నిర్వహిస్తారు. వీటిని అక్టోబరు 30వ తేదీకి పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే పలు పాఠశాలల్లో వీటిని మొదలుపెట్టారు. వడపోత తర్వాత చివరికి ముగ్గురిని ఎంపిక చేస్తారు. వాళ్లను అమరావతి అసెంబ్లీ వీక్షణకు పంపిస్తారు. ఎంపిక అనంతరం కార్యాచరణపై ఆదేశాలు వెలువడాల్సి ఉందని విద్యాధికారులు చెబుతున్నారు.

గత డీఎల్‌పీవో చంద్రశేఖర్‌కు 2 ఇంక్రిమెంట్లు నిలిపివేత

రాజమహేంద్రవరం రూరల్ అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గతంలో రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ అధికారిగా పనిచేసి.. ప్రస్తుతం పాడేరు జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న కేపీ చంద్రశేఖర్‌కు రెండు యాన్యుయల్ ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో రాజమహేంద్రవరం డీఎల్‌పీవోగా పనిచేసిన కాలంలో రూరల్ మండల పరిధిలోని బొమ్మూరు,కాతేరు, హుకుంపేట, పిడింగొయ్యి గ్రామాల పరిధిలో అవకతవకలకు పాల్పడినట్టు విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఈ వ్యవహారంపై పలుమార్లు విచారణ చేపట్టి నివేదికలు సమర్పించారు.ఈ మేరకు క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్టు ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కెపీ చంద్రశేఖర్‌తో పాటు అప్పటి పిడింగొయ్యి పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబుకు ఒక ఇంక్రిమెంట్ నిలుపుదల చేశారు.మరో 8 మంది పంచాయతీ అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టనున్నట్టు తెలిసింది

ఏసీబీ పేరుతో మోసగిస్తున్నారు జాగ్రత్త

డీఎస్పీ కిషోర్ కుమార్

రాజమహేంద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కొందరు దుండగులు తాము ఏసీబీ అధికారులమంటూ ప్రభుత్వ ఉద్యోగులను ఫోన్ ద్వారా మోసగించే ఘటనలు జరగడం తమ దృష్టికి వచ్చిందని ఏసీబీ డీఎస్పీ కిశోర్ కుమార్ తెలిపారు. ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం, బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ ఉద్యోగులకు ఆదివారం ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి 'మీపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. దాడులు జరగకుండా ఉండాలంటే డబ్బులివ్వాలి' అని మాట్లాడారన్నారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగాయన్నారు. ఈ కాల్స్‌కు ప్రభుత్వ ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించ వద్దన్నారు. ఆ ఫోన్లపై వెంటనే సంబం ధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయా లన్నారు.ఫోన్ నెంబర్లు 94404 46160, 08832 467 833కి సమాచారం ఇవ్వాలన్నారు.

96 పాఠశాలల్లో ఆధార్ నవీకరణ : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 96 పాఠశాలల్లో ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ ప్రత్యేక శిబిరాలను ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. 5 నుంచి 17 ఏళ్ల మధ్య వయసు కలిగిన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో ప్రధానంగా పెండింగ్ ఎంబీయూలపై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఆధార్ రికార్డులో వేలిముద్రలు, ఐరిస్ స్కాన్, ఫొటోను తప్పనిసరిగా అప్‌డేట్ చేయడాన్ని ఎంబీయూ అంటారన్నారు. ఎంబీయూ పూర్తి చేయడం వల్ల ప్రభుత్వ పథకాలు, స్కూల్ సర్వీసులు, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడం సులభతరం అవుతుందన్నారు. హెచ్‌ఎంలు, విద్యాధికారులు గడువు లోపుగా నవీకరణలను పూర్తి చేయడం లక్ష్యంగా చేసుకోవాలని ఆదేశించారు.

నేడు మునిరత్నం నాయుడు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపాధ్యక్షుడిగా ఆచార్య డి.మునిరత్నం నాయుడు గురువారం(నేడు) ఉదయం బాధ్యతలు స్వీకరిస్తారని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. బొమ్మూరులోని విశ్వవిద్యాలయంలో పదవీ బాధ్యతల కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.





నిండు వాన

రాజమహేంద్రవరంలో వాన నీటితో నిండిన రహదారులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో భారీ వర్షం కురిసింది, బుధవారం ఉదయం ఎండ కాసినప్పటికి మధ్యమధ్యలో మబ్బులో వాతావరణం కనిపించింది. అక్కడక్కడా జల్లులుగా వర్షం కురిసింది. సాయంత్రం 5:30 గంటలకు వర్షం ప్రారంభమై రాత్రి 8గంటల వరకు పడింది. కుండపోత మాదిరిగా వర్షం కురియడంతో నగ రంలో కంబాలచెరువు, తాడితోట డౌన్, వైంజక్షన్, ఆర్‌టీవో ఆఫీస్ రోడ్డు, కోరుకొండ రోడ్డు, పేపరుమిల్లు రోడ్డు ,రామచంద్రరావు పేట తదితర ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్డెక్కింది. 45 నిమిషాల తర్వాత వర్షం చినుకుచినుకుగా పడడంతో నీరు లాగింది. సాయంత్రం వర్షం ప్రారంభం కావడంతో స్కూల్స్, కళాశాల నుంచి ఇళ్ళకు చేరుకునే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

రానున్న 24 గంటల్లో.. భారీ వర్షాలు : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో గోదావరి తీర ప్రాంత, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. దక్షిణ తూర్పు అరేబియా సముద్రంలో ఏర్పడిన తీవ్ర అవర్తనం, తమిళనాడు తీరానికి సమీపంలో దక్షిణ పశ్చిమ బంగాళాఖాతంలో కొనసాగుతున్న బలమైన తక్కువ పీడన ప్రాంతం కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. వర్షపాతం తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ తీగలు తెగిపడడం, చెట్లు కూలడం వంటివి జరుగుతాయని.. ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్య వేక్షిస్తున్నామన్నారు. వర్షాల నేపథ్యంలో అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దన్నారు.



ఆర్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆషా, ఐఎంఏ ప్రతినిధులు

ఆసుపత్రుల బకాయిలు చెల్లించాలని ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ బకాయిలు తక్షణమే చెల్లించాలని ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆషా రాష్ట్ర అధ్యక్షుడు కె.విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు దాదాపు రూ.3 వేల కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని..వీటిలో సీఎంఎఫ్‌ఎస్‌లో ఉన్న రూ.670 కోట్లను వెంటనే చెల్లించాలని కోరుతున్నామన్నారు. మిగిలిన బకాయిలను రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నిర్దిత గడువులో చెల్లించాలని అడుగుతున్నామన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న యూనివర్శల్ హెల్త్ స్కీమ్‌లో తమను భాగస్వాములని చేయమని కోరుతున్నామన్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈనెల 10వ తేదీ నుంచి అత్యవసర సేవలు సైతం నిలిపివేశామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో నుంచి రూ.250 కోట్లు ఇస్తామని, మహాధర్నా ఆపేయమని మంగళవారం సాయంత్రం సమాచారం వచ్చిందని, దీనికి సభ్యులు ఒప్పుకోలేదన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో గురువారం మహాధర్నా చేపడతామని వెల్లడించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు పి.విజయభాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల సమస్యలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, ఇది సరికాదన్నారు. తమకు పావలా ఇస్తూ, రెండు రూపాయల పని చేయించుకుంటున్నారన్నారు. ఈ ధర్నాలో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో బుధవారం కొత్తపేటకు చెందిన ఒక వృద్ధురాలికి అరుదైన శస్త్ర చికిత్స చేశారు. మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సమీరాజా నేతృత్వంలోని వైద్యబృందం ఆమె పొత్తి కడుపులో ఉన్న 10 కిలోల బరువైన ట్యూమర్‌ను తొలగించారు. జీజీహెచ్‌లో గతేడాదికాలంలో 150 మందికి పైగా రోగులకు కీమోథెరపీ చికిత్స విజయవంతంగా అందించామని మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సమీరాజా, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్పందన తెలిపారు. జిల్లా ప్రజలు క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సకు ప్రభుత్వ బోధనాసుపత్రిలో చేరాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు.



సీతానగరం సొసైటీల్లో ఎరువుల అమ్మకాలు నిలిపివేత

సీతానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం మండలంలోని పలు సొసైటీల్లో ఎరువుల అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేశామని ఏడీఏ శశిబిందు తెలిపారు. ములకల్లంక ,మిర్తిపాడు,రఘుదేవపురం సొసైటీలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టరు, బిల్లు బుక్స్, ఈ పోస్ మిషన్ బ్యాలెన్స్ తేడా రావడంతో ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలని ఆయా సొసైటీల సీఈవోలకు సూచించారు. ములకల్లంక సొసైటీలో రూ.2.11 లక్షలు, మిర్తిపాడు సొసైటీలో రూ.21.18 లక్షలు, రఘుదేవపురం సొసైటీలో రూ.9.40 లక్షల ఎరువుల అమ్మకాల రికార్డులు సరిగా లేకపోవడంతో అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. ఆయా సొసైటీల్లో ఎటు వంటి అవకతవకలు జరగలేదని..రికార్డుల్లో పొందుపర్చడంతో జాప్యం జరిగిందని వాటిని సరిచేయాలని ఆదేశించడం జరిగిందన్నారు.

పరమశివునికి ప్రణమిల్లి



రాజమహేంద్రవరం గోదావరి నదిలో పాడ్యమి దీపాలు వదులుతున్న మహిళలు


రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో పుణ్యసాన్నాలు చేస్తున్న భక్తులు


పిఠాపురం పాదగయ క్షేత్రంలో పాడ్యమి దీపాలతో భక్తులు



- కార్తీక మాసం తొలిరోజు శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- పరమశివునికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు
- పాడ్యమి దీపాలు వెలిగించిన మహిళలు


సామర్లకోటలో జ్యోతిర్లింగార్చన


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో గోలింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

భక్తజనసంద్రమైన పిఠాపురం పాదగయ


కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాకినాడ జిల్లా పిఠాపురం లోని పాదగయ క్షేత్రం కార్తీక మాసం తొలిరోజైన బుధవారం భక్తజనసంద్రమైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచే పాదగయకు చేరుకున్న భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక మాసానికి ప్రారంభ సూచకంగా అరటి డొప్పల్లో పాడ్యమి దీపాలు వెలిగించి పుష్కరిణిలో వదిలారు. మహిళలు, చిన్నారులు, భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. స్వయంభూగా వెలసిన రాజరాజేశ్వరీ సమేత కుక్కుటేశ్వరస్వామికి పంచామృత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అభిషేకాలు జరిగాయి. అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. శివమాలధారులు, భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయమంతా దీపాలు వెలిగించడంతో వెలుగులు విరజిమ్మాయి. ఉచిత అన్నప్రసాదాలు, చిన్నారులకు పాలు, బిస్కట్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పాదగయ ఆవరణలో శివలింగానికి అభిషేకం చేస్తున్న శివమాలధారులు

శివనామస్మరణతో మార్మోగిన సామర్లకోట



భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు, విశేషాలంకరణలో స్వామి

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం శివనామస్మరణతో మార్మోగింది. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) పర్యవేక్షణలో తెల్లవారుజామున గోపూజ జరిపారు. భీమేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలను ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణలతో నిర్వహించారు. విశేష పుష్పార్చన జరిపి స్వామివారిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 800 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసరు కె.నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తొలిరోజు లక్ష పత్రి పూజలో జగ్గంపేటకు చెందిన కంచర్ల కుటుంబీకులు ఆశీనులయ్యారు. దూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు రాత్రివేళ పూరీలు, పుల్కాలు, చపాతీలను ఆలయం వెలుపల భీమేశ్వర అన్నదాన ట్రస్టు ఆవరణలో అందజేస్తామని ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ విలేకరులకు తెలిపారు.


భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

లేటరైట్ తవ్వకాలు, తరలింపుతో జీవితాలు చిన్నాభిన్నం

- లేటరైట్ మైనింగ్ నిలిపివేయాలని డిమాండ్
- డిప్యూటీ సీఎం నివాసంలో ఫిర్యాదు చేసిన అనకాపల్లి జిల్లా గిరిజనులు


జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న అనకాపల్లి జిల్లా నాతవరం మండలం బబిడికలొద్ది, తొరడా గ్రామాలకు చెందిన గిరిజనులు

పిఠాపురం/గొల్లప్రోలురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ ఎత్తున సాగుతున్న లేటరైట్ తవ్వకాలు, రవాణాతో తమ జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని, భూములు సాగు చేసుకునే అవకాశం కోల్పోయామని అనకాపల్లి జిల్లా నాతవరం మండలం బబిడికలొద్ది, తొరడా గ్రామాలకు చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసానికి వచ్చి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎంకు తమ సమస్యలు తెలియజేయాలని కోరుతూ జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. తామంతా ప్రకృతిపై ఆధారపడి పోడు వ్యవసాయంతో జీవనం సాగించేవాళ్లమని తెలిపారు. 2014, 2021 సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వ పెద్దలు ఇక్కడ లాటరైట్ తవ్వకాలను ప్రారంభించి నేటికీ కొనసాగిస్తున్నారని చెప్పారు. నిత్యం వందల సంఖ్యలో లారీల్లో లేటరైట్ తరలిపోతోందని తెలిపారు. దీనివల్ల తమ భూములు, తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఆ ప్రాంతంలో నివాసం ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. నాటి ప్రభుత్వ పెద్దలు కోట్లాది రూపాయలను లేటరైట్ మైనింగ్ ద్వారా ఆర్జిస్తూ తమ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లేటరైట్ రవాణా చేసే లారీల కింద పడి పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇదే విషయంపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆదివాసీల హక్కులు, అభివృద్ధి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని లేటరైట్ మైనింగ్ నిలుపుదల చేయాలని కోరారు. తమ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుందరకోడ పంచాయతీ బబిడికలొద్ది గ్రామ గంగాలమ్మ వెల్ఫేర్ సొసైటీ, తొరడా గ్రామ నందూలమ్మ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఎం.నూకరాజు, టి.శాంతి, చెల్లాయ్యమ్మ, సంకు రమణ, నూకలోవ పాల్గొన్నారు.

తక్కువ వ్యవధిలో విద్యుత్ కనెక్షన్

- ఈపీడీసీఎల్ కొత్త విధానం
- దరఖాస్తుతోనే స్థిర చార్జీల వసూళ్లు
- రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా శ్రీకారం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ల జారీకి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కొత్త విధానం అమలులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు కొత్త కనెక్షన్ కావాలంటే దరఖాస్తు సమర్పించిన తరువాత స్థల పరిశీలన చేసి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసేవారు. దానిపై సర్వీస్ లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. తనిఖీకి వచ్చిన అధికారి విచక్షణపై ఈ మొత్తం ఆధారపడి ఉండేది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ లివింగ్'ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విద్యుత్ వినియోగదారుల చట్టం 2020కి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కొన్ని సవరణలు చేయడంతో ఏపీఈపీడీసీఎల్ కొత్త విధానం తీసుకువచ్చింది. 150 కిలోవాట్ల వరకు కనెక్షన్లకు ఫిక్సిడ్ చార్జీలు నిర్ణయించారు. ఈ మొత్తాన్ని దరఖాస్తుతో పాటు చెల్లిస్తే వెంటనే కనెక్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ అయిపోతాయి. దీనివల్ల చాలా తక్కువ సమయంలో విద్యుత్ సదుపాయం లభిస్తుంది. సైట్ ఇన్‌స్పెక్షన్, ఎస్టిమేషన్ వంటివి ఇందులో ఉండవు.

ఎవరికి వర్తిస్తుందంటే..?

ఇప్పటికే విద్యుత్ సదుపాయం ఉన్న ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ఉన్నవారు కొత్త కనెక్షన్ తీసుకుంటే చార్జీలు ఇలా ఉంటాయి.

- గృహ వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,500.
- వాణిజ్య వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,800
- ఆపై ప్రతి అదనపు కిలోవాట్‌కు రూ.2 వేలు చొప్పున తీసుకుంటారు. ఇలా 20 కిలోవాట్ల వరకు లెక్కించి తీసుకుంటారు.

ఇవికాకుండా కనెక్షన్ లోడ్ చార్జీల (డొమెస్టిక్) కింద సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ చార్జీలు కలిపి 500 వాట్ల వరకు రూ.800, ఆపై 501 నుంచి 1000 వాట్ల వరకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది..

నాన్ డొమెస్టిక్/కమర్షియల్ కనెక్షన్లకు

మొదటి 250 వాట్ల వరకు రూ.600, 251 వాట్ల నుంచి 500 వాట్ల వరకు రూ.1,000 కట్టాలి. ఇలా ఎల్‌టీ-3, ఎల్‌టీ-4, హెచ్‌టీ కనెక్షన్ కోరుకునే వారికి చార్జీలు నిర్ణయించారు.

ముందుగా చెల్లించడంతో తక్షణ సేవలు

- పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్



స్థిరమైన చార్జీలు ముందుగానే నిర్ణయించడంవల్ల ఎస్టిమేషన్ పేరుతో జాప్యం ఉండదు. విచక్షణా అధికారంతో అంచనాలు పెంచే అవకాశమూ లేదు. ఎవరికి ఎంత విద్యుత్ లోడ్ పడుతుందో లెక్కించుకొని ఆ మేరకు చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. దీని వల్ల తక్షణమే సేవలు అందించగలుగుతాము. ఇదంతా పూర్తి పారదర్శకంగా ఉంటుంది.

వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1.87 కోట్లు

- బంగారం 47 గ్రాములు, వెండి 1240 గ్రాములు, 25 విదేశీ కరెన్సీ నోట్లు


వాడపల్లి వెంకన్న ఆలయంలో స్వామివారి హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణ అధికారులు డి.సురేష్‌బాబు, జె.రామలింగేశ్వరావు, పీవీవీఎస్ కామేశ్వరావు పరివేక్షణలో స్వామివారి కానుకలు లెక్కింపు నిర్వహించారు. 35 రోజులకుగాను ప్రధాన హుండీలు ద్వారా రూ.1,41,69,487, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.45,63,842 వెరసి రూ.1,87,33,329 ఆదాయం లభించింది. బంగారం 47 గ్రాములు, వెండి 1240 గ్రాములు, ఆరు దేశాలకు చెందిన 25 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఈ లెక్కింపులో అర్చకులు, వేద పండితులు, బ్యాంకు సిబ్బంది, శ్రీవారి సేవకులు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం

నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

- నన్నయలో అంతర్‌జిల్లాల జూడో పురుషులు, మహిళల పోటీలు


జూడో పోటీలను తిలకిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

దివాన్‌చెరువు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జూడో క్రమశిక్షణ, గౌరవం, అజేయమైన స్ఫూర్తిని సూచిస్తుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ఆధ్వర్యంలో జూడో పురుషుల, మహిళల అంతర్ కళాశాలల ఛాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు బుధవారం జరిగాయి. విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీలను వీసీ ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్ కళాశాలల జూడో ఛాంపియన్‌షిప్ నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు అందరినీ కలుపుకుంటూ ముందుకు సాగాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం క్రీడలకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. గోదావరి జిల్లాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయం నిర్వహించే వివిధ క్రీడాపోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. అనంతరం వివిధ కేటగిరీలలో జూడో పురుషులకు, మహిళలకు పోటీలు నిర్వహించారు. మహిళలకు48 కేజీల నుంచి 78 కేజీల వరకూ, పురుషులకు 60 కేజీల నుంచి 100 కేజీల వరకూ పోటీలు జరిగాయి. దీనిలో ఉత్తమ ప్రతిభకనబరచిన విజేతలను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేసి వచ్చేనెల 10 నుంచి 14 వరకూ భోపాల్‌లోని గ్లోబల్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ వెస్ట్‌జోన్ పోటీలకు పంపుతారు. పోటీల అనంతరం విజేతలకు పతకాలను ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, క్రీడాబోర్డు సహాయకార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్.మూర్తి, పరిశీలకుడు ఎస్.వి.ఎల్.ఎల్.జి.వర్మ, సభ్యులు పి.వి.తేజ, టి.వి.వి.రమణ, జిల్లా డి.ఎస్.డి.ఓ. డీఎంఎం శేషగిరి పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి కార్తీక ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- 2న క్షీరాబ్ధి ద్వాదశిరోజున గిరిప్రదక్షణ, తెప్పోత్సవం ఘనంగా నిర్వహించాలి
- లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- అన్నదాన కార్యక్రమాలకు ఎమ్మెల్యే రూ.3లక్షల విరాళం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు

కోరుకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని కోరుకొండ దేవాలయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి దేవ స్థాన కార్యనిర్వహణ అధికారి, ఇతర అధికారులు, వివిధశాఖల అధికారులతో శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్ష నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే కోరుకొండ శ్రీలక్ష్మీనసిహస్వామి కార్తీకమాస శుద్ధ ద్వాదశి ఉత్సవాలను వైభవంగ నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. లక్ష్మీనరసింహస్వామివారి గిరి ప్రదక్షణ, తెప్పోత్సవం వైభవంగా నిర్వహించేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్తీకమాసంలో నవంబర 2న తేదీ క్షీరాబ్ధి ద్వాదశిరోజున గిరిప్రదక్షణ, తెప్పోత్సవంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. కార్తీకశుద్ధ ద్వాదశి (క్షీరాబ్ధిద్వాదశి)రోజున సాయంత్ర 5గంటల నుంచి స్వామివారి విగ్రహాలను పల్లకీపై ఊరేగింపుగా గిరి ప్రదక్షణ నిర్వహిస్తూ కోనేరు వద్ద నిర్వహించే తెప్పోత్సవం విజయవంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైదిక కార్యక్రమం నిర్ణీత సమయానికి తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. తెప్పోత్సవంనకు తగిన ఏర్పాట్లు, ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఇన్స్యూరెన్స్ వంటి చర్యలు తీసుకోవాలని అన్నారు. కోనేరు వద్ద విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని పేర్కొన్నారు. వేదిక వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా కోరుకొండ మెడికల్ అధికారులను ఆదేశించారు. తెప్పోత్సవం సందర్భంగా లైఫ్ జాకెట్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. గజ ఈతగాళ్ళను అందుబాటు ఉంచాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్, అగ్నిమాపక అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బలరామ కృష్ణ సూచించారు. తెప్పోత్సవం విజయవంతం కావడానికి వీలుగా కోనేరులో నీరు నిలిచేలా ఇరిగేషన్ అధికారులు చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య లోపం లేకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కార్తీకమాస ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా జరిగే అన్నదాన కార్యక్రమానికి బత్తుల కుటుంబం నుంచి రూ.3లక్షలు విరాళంను ఎమ్మెల్యే ప్రకటించారు.

కన్నేసి.. కాటేసి!

- తునిలో బాలికపై ఘోరం
- తాతయ్య వరసయ్యే వృద్ధుడు కాటేసిన వైనం
- ఆస్పత్రి పేరుతో బాలికను పాఠశాల నుంచి తీసుకువెళ్లిన నిందితుడు
- తొండంగిలో ఓ తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం: ఆనక స్కూల్లో దించేసి ఇంటికి..
- వీడియో వైరల్ అవడంతో విషయం తెలిసి నిందితుడిని చితకబాదిన బంధువులు
- బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి అత్యాచారంగా నిర్ధారణ
- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు: పోక్సో, అత్యాచారం, కిడ్నాప్ కేసుల నమోదు

దారుణం.. అమానుషం.. మాటల్లో చెప్పలేని ఘోరం.. మాయమాటలు చెప్పి అభం శుభం ఎరుగని బాలికపై అత్యాచారం.. తాతయ్య వరుసయ్యే దగ్గరి బంధువే అఘాయిత్యానికి ఒడిగట్టిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా చేసింది..



నారాయణరావును పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

(కాకినాడ/తునిరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ శివారులో ఓ గురుకుల పాఠశాలలో ఓ బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. కొంత కాలం కిందట బాలిక తండ్రి మరణించాడు. ఆర్థిక కష్టాలు చుట్టుముట్టడంతో ఆమెను చదువు మానిపించేయాలని అనుకున్నా, ఆ పని చేయలేక తల్లి గురుకుల పాఠశాలలో చేర్పించింది. వీరికి దగ్గరి బంధువైన తుని పట్టణంలో రెండో వార్డుకు చెందిన తాటిక నారాయణరావు(62) బాలికపై కన్నేశాడు. మాయమాటలు చెప్పి గురుకుల పాఠశాల యాజమాన్యాన్ని తాను బాలిక తాతయ్యగా నమ్మించాడు. అనేకసార్లు పాఠశాలకు వచ్చి బాలికను ఆస్పత్రికి చూపించాలంటూ స్కూల్ నుంచి తీసుకువెళ్లేవాడు. తాతయ్య కావడంతో పాఠశాల సిబ్బందికి కూ డా అనుమానం రాలేదు. ఎప్పటిలా అతడు మంగళవారం ఉదయం 11 గంటలకు స్కూలుకు వచ్చి బాలికను బయటకు తీసుకువెళ్లాడు. అనంతరం ఆమెకు తిను బండారాలు కొనిచ్చాడు. తనంటే ఇష్టం ఏర్పడేలా చేసుకున్నాడు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు తొండంగి మండలం పైడికొండ గ్రామ శివార్లలోని సపోటా తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కేకలు వేయడంతో అక్కడే ఉన్న ఓ రైతు గమనించి అక్కడికి వచ్చాడు. నువ్వెవరు.. స్కూలు పిల్లను తోటలోకి తీసుకువచ్చి ఏం చేస్తున్నావంటూ నిలదీశాడు. అత్యాచారం చేసిన సదరు నిందితుడు రైతుపై ఎదురుతిరిగాడు. దీంతో రైతు మరింత ఆగ్రహంతో స్కూలు అమ్మాయిని తోటలోకి తీసుకువచ్చి బట్టలు విప్పి ఏం చేస్తున్నావు.. అంటూ గద్దించాడు. దీంతో నిందితుడు మరింత ఎదురుతిరిగి నేను మున్సిపాల్టీ కౌన్సిలర్‌ను అంటూ గట్టిగా మాట్లాడాడు. బాలికను ఇదే తోటలోకి అనేకసార్లు తీసుకువచ్చి ఇక్కడ ఏం చేస్తున్నావు అంటూ రైతు మళ్లీ నిలదీయడంతో.. నేను పాడు చేశానా.. అమ్మాయి బాత్‌రూంకి అంటే తీసుకువచ్చా అంటూ బుకాయించాడు. బట్టలు విప్పి ఏంచేస్తున్నావు అని గద్దించి పోలీసులకు ఫోన్ చేస్తా అని రైతు మరింత నిలదీయడంతో తాతయ్యను అవుతాను.. బాత్‌రూంకు తీసుకువచ్చాను అంటూ సమాధానం ఇచ్చాడు. తర్వాత గుట్టుగా బాలికను గురుకుల పాఠశాలలో దించేసి ఏం ఎరుగనట్లు తునిలో తన ఇంటికి వెళ్లిపోయాడు.

వైరల్ అవడంతో..

తోటలో బాలికతో సదరు నిందిడుతు ఉన్న వీడియోలను కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవికాస్తా క్షణాల్లో వైరల్ అయ్యాయి. దీంతో విషయం బాలిక కుటుంబీకులు, బంధువులకు తెలిసింది. దీంతో వారంతా సదరు నిందితుడి ఇంటికి వెళ్లి నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో వారంతా సదరు నిందితుడికి మంగళవారం రాత్రి దేహశుద్ధి చేసి తుని రూరల్ పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత బుధవారం ఉదయం గురుకుల పాఠశాల ఎదుట బాలిక బంధువులు ఆందోళనకు దిగారు. బాలికను పదేపదే నిందితుడితో ఎలా పంపిస్తారనే దానిపై గురుకుల పాఠశాల సిబ్బందిని నిలదీశారు. కాసేపటికి పోలీసులు రావడంతో వారిని కూడా నిలదీశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సాయంత్రం బాలికకు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు అత్యాచారం జరిగినట్లు నిర్ధారించారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు తుని రూరల్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు తుని రూరల్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 250/2025 కింద యూ/ఎస్ 137 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ప్రిన్సిపాల్ వివరణ..

ఈ ఘటనపై గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగజ్యోతి మాట్లాడుతూ తాను పాఠశాలలో కొత్తగా విధుల్లో చేరడం వల్ల ఎప్పటి నుంచో కొనసాగుతున్న ఉపాధ్యాయుల ధ్రువీకరణ మేరకు బాలిక బయటకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న పెద్దాపురం డీఎస్పీ

దుష్ప్రచారంపై హెచ్చరిక..

కాగా నిందితుడు కూటమి పార్టీకి చెందిన వ్యక్తిగా చిత్రీకరించేందుకు వైసీపీ ప్రయత్నం చేయడం వివాదాస్పదంగా మారింది. దీంతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు గురుకుల పాఠశాల వద్ద మీడియాతో మాట్లాడారు. నిందితుడు నారాయణరావుకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదన్నారు. నారాయణరావుపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. కిడ్నాప్, అత్యాచారం కింద వచ్చే వివిధ కఠినమైన సెక్షన్‌లు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు. అయితే బాలిక వీడియోను కొందరు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారని, ఇది కూడా పోక్సో కేసులోకి వస్తుందని డీఎస్పీ తెలిపారు. అత్యాచార ఘటనపై ఎంపీ సానా సతీష్‌బాబు, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఖండించి నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

రాజమహేంద్రవరంలో బాలికల హాస్టల్ వార్డెన్ సస్పెండ్

కలెక్టర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సంక్షేమ బాలికల వసతిగృహానికి చెందిన విద్యార్థినిపై అత్యాచారం సంఘటన నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్య వైఖరి నిర్ధారణ కావడంతో హాస్టల్ అధికారిణి ఉమాదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. బంధువుల వివరాలు, గుర్తింపు నిర్ధారించకుండానే పిల్లలను బయటకు పంపరాదని స్పష్టం చేశారు. వార్డెన్లు, సిబ్బంది సంపూర్ణ బాధ్యతతో అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. వసతిగృహాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు కల్టెర్ ఆదేశాలు జారీ చేశారు.

వసతి గృహం విద్యార్థినిపై అఘాయిత్యం దారుణం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సాంఘిక సంక్షేమ వసతిగృహంలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యం చాలా దారుణమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ విచారణ జరిపించి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. బాలికపై అఘాయిత్యం చేసిన అజయ్‌ను అతడికి సహకరించిన మరొక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారని చెప్పారు. వసతిగృహాల వద్దకు తల్లిదండ్రులను తప్ప ఎవ్వరినీ అనుమతించకూడదని, ఎవరైనా వస్తే సరైన ఆధారాలు ఉంటేనే అనుమతి విషయంలో ఆలోచించాలని కోరారు.

బాణసంచా పేలుడు ఘటనలో బాధితులకు.. రూ.కోటి 50 లక్షల చెక్కు అందజేత



చెక్కును కార్మికశాఖ సహాయ కమిషనర్‌కు అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాకలో శ్రీలక్ష్మీ గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో ఈ నెల 8న జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతులమీదుగా రూ.కోటి 50లక్షల చెక్కును కోనసీమ సహాయ కార్మిక కమిషనర్‌కు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ సంఘటనలో పది మంది మృత్యువాత పడ్డారు. పేలుడు వల్ల మరణించిన వారికుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఏపీ కార్మికశాఖ సంక్షేమ మండలి కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కార్మికశాఖ కమిషనర్ రూ.కోటి 50లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ పేరున అందజేశారు. ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం కింద నమోదైన సంస్థల్లో పనిచేసే కార్మికులకు కార్మిక సంక్షేమ మండలినందు రూ.100 వంతున వెల్ఫేర్ ఫండ్ చెల్లించడం జరుగుతుంది. యజమాని వాటా రూ.70, కార్మికుని వాటా రూ.30 చొప్పున చెల్లిస్తారు. దీని ద్వారా సంక్షేమ పథకాలు అందించేవారు. అయితే ఈ పథకాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినప్పటికీ కోనసీమ కలెక్టర్ చొరవతో రాయవరం ఘటన బాధితులకు రూ.కోటి 50లక్షలు మంజూరు చేయడం జరిగిందని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ పేర్కొన్నారు.

వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చుకు యువకుడు బలి



వీర కుమార్ (ఫైల్)

ప్రత్తిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగ ఉచ్చుకు యువకుడు బలయ్యాడు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం గోకవరం గ్రామ పంచాయతీ శివారు ఆరేళ్ళ ధార వద్ద ఈ ఘటన జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం గ్రామం నూకాలమ్మ గుడి వీధికి చెందిన వందల వీర కుమార్ (31)వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం వేకువ జామునే పని నిమిత్తం వంతాడ యార్డ్ సమీపంలో గల ఆరేళ్ళధార పొలాల్లో నడిచి వెళ్తుండగా వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ ఉచ్చుకు చెందిన కరెంటు తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పొలాల్లోకి పనిబాట్లకు వెళ్లే వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరకుమార్‌కు భార్య కాసులమ్మ, కొడుకు దుర్గాతేజరాజ్‌కుమార్ ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

గాజువాక వాసి మృతి



కిరణ్‌కుమార్ మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

కడియం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియపులంక పరిధిలోని బుర్రిలంక గోకుల్‌నర్సరీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాజువాక అగనంపూడికి చెందిన వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కడియం పోలీసుల కథనం ప్రకారం.. గాజువాక అగనంపూడికి చెందిన దాసరి కిరణ్‌కుమార్(26) కారులో విజయవాడ నుంచి విశాఖపట్టణం వెళ్తున్నాడు. కడియపులంక వద్ద ఆగి ఉన్న లారీని అదుపుతప్పి కారు ఢీకొనడంతో కిరణ్‌కుమార్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. హైవే సేఫ్టీ అధికారులు క్రేన్ సహాయంతో లారీ నుంచి కారును వేరు చేయించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కడియం పోలీసులు కేసు నమోదు చేశారు.

మానసిక స్థితి సరిగా లేక బ్లేడుతో గొంతు కోసుకున్న వ్యక్తి



గొంతు కోసుకున్న దాసు

వై.రామవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి బుధవారం వై.రామవరం, యార్లగడ్డ గ్రామాల మధ్య శివాలయం సమీపంలో బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే వెళ్లి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా కొయ్యూరు మండల యు.చీడిపాలెం పంచాయితీ కంపు మామిడికి చెందిన కాళ్ళ దాసు (45)కు మానసిక స్థితి సరిగా లేక గతంలో కుటుంబీకులు రాజమండ్రిలో చికిత్సకు తీసుకెళ్లారు. ఇంటికొచ్చాక పురుగు ల మందు తాగడంత మళ్లీ కాకినాడ తరలించారు. అక్కడ నుంచి పి.ఎర్ర గొండ సచివాలయంలో నర్సుగా పని చేస్తున్న తన అక్క కూతురు ఇంటికి వచ్చిన కాళ్ళ దాసు బ్లేడుతో గొంతు కోసుకున్నట్టు భార్య, కుమార్తె తెలిపారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు పేర్కొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్, మరో ఇద్దరిపై కేసు కొట్టివేత

కాకినాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏఎంసీ మాజీ చైర్మన్ నృసింహదేవర విశ్వనాథం, మరో ఇద్దరిపై గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి సోదరుడు వీరభద్రారెడ్డి పెట్టిన కేసును కోర్టు బుధవారం కొట్టివేసింది. వివరాలను విశ్వనాథం తెలిపారు. 2019 ఎన్నికల పోలింగ్‌లో అవకతవకలకు పాల్పడినట్టు విశ్వనాథం, మరో ఇద్దరిపై వీరభద్రారెడ్డి కేసు పెట్టారు. దీంతో 2019 మే 26న వీరిపై కేసు నమోదు చేశారు. ఐదేళ్ల పాటు కాకినాడ సెకండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ సాగింది. అభియోగాలు రుజువు కాకపోవడంతో ఈ కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

రైల్వే భూములు ఆక్రమించి కట్టడాలు

చర్యలు తీసుకోవాలని కాకినాడ కలెక్టర్‌కు రైల్వే అధికారుల ఫిర్యాదు

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో ఎఫ్‌సీఐ గోదాములు నుంచి రైల్వే స్టేషన్ వరకూ సుమారు 2కిలోమీటర్ల ట్రాక్ పొడవునా రైల్వే భూములు ఆక్రమించి కట్టడాలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రైల్వే విజయవాడ డివిజినల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రైల్వే అధికారులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ ఏఈ ఎన్.శ్రీనివాసరావు సామర్లకోట మండల సర్వేయర్లు బుధవారం సామర్లకోట రైల్వే ఏఈఎన్ ప్రభాకర్‌తో సమీక్షించారు. సర్వేయర్ల వద్ద ఉన్న పాత అడంగళ్ మ్యాపులను అధికారులు పరిశీలించారు. వాస్తవంగా ఉన్న కనిపిస్తున్న విస్తీర్ణానికి పత అడంగళ్‌లో ఉన్న విస్తీర్ణానికి ఎక్కడా పొంతనలేకుండా ఆక్రమనలు పెరిగి పోయినట్టు రైల్వే అధికారులు గుర్తించారు. అలాగే మట్టపల్లి వారి చెరువు నుంచి పొర్లు జలాలు బయటకు వెళ్లేందుకు 15ఏళ్ల క్రితం నిర్మించిన స్లూయి జ్‌లను ఆక్రమించి చెరువు నుంచి జలాలు రైల్వే భూములమీదుగా వెళ్లేందుకు వీలులేకుండా పెద్దఎత్తున ఆక్రమణలకు పాల్పడినట్టు ప్రాథమికంగా రైల్వే అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణల వల్లే సామర్లకోట ఎగువ ప్రాంతాల్లో వర్షం నీరు సత్యనారాయణపురం మీదుగా రైల్వే ట్రాక్‌పైకి చేరుకుని రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం కలుగుతుందని నివేదికను విజయవాడ రైల్వే ఉన్నతాధికారులకు పంపినట్టు సమాచారం.

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా విషాదం

- వ్యాన్ ఢీకొని కుమారుడి మృతి
- తల్లిదండ్రులకు గాయాలు
- గుత్తులవారిపాలెం సమీపంలో ఘటన



మృతిచెందిన రామవెంకట కృష్ణప్రసాద్ (ఫైల్)



గాయపడిన నూకరత్నంను ఆటోలో తరలిస్తున్న దృశ్యం



గాయపడిన నూకరాజు

ముమ్మిడివరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న వారిని కోళ్ల వ్యాను ఢీకొనడంతో మోటారు సైకిల్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా అతడి తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన 216 జాతీయ రహదారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ బైపాస్ రోడ్డులో గుత్తులవారిపాలెం సమీపంలో బుధవారం జరిగింది. యానాం సుభద్ర నగర్‌కు చెందిన దింపు కార్మికులు మట్టపర్తి నూకరాజు (50), అతడి భార్య నూకరత్నం (47), కుమారుడు రామ వెంకటకృష్ణప్రసాద్ (22) పల్సర్ మోటారు సైకిల్‌పై అప్పనపల్లి బాలబాలాజీని దర్శించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా ముమ్మిడివరం బైపాస్ రోడ్డు గుత్తులవారిపాలెం సమీపంలో ఎదురుగా ఖాళీగా వస్తున్న కోళ్ల వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామవెంకటకృష్ణప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి నూకరాజు, తల్లి నూకరత్నం తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఐటీడీఏ ఏపీడీ టి.విశ్వనాథం స్పందించి అంబులెన్సుకు ఫోన్ చేయగా అది రావడం ఆలస్యం అవుతుందని భావించి గాయపడిన నూకరత్నం, నూకరాజును ఆటోలో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ టి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడీ విశ్వనాథం మాట్లాడుతూ ప్రమాదాలు ఎలా జరుగుతాయో ముందుగా ఎవరూ ఊహించలేమని, మనవంతు జాగ్రత్తలు పాటించాలన్నారు. వెంకటకృష్ణప్రసాద్ హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృత్యువాతకు గురయ్యాడన్నారు.

వ్యక్తి హత్య కేసులో ఐదుగురి అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, చిత్రంలో సర్కిల్‌లోని ఎస్ఐలు

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన తమిళనాడుకు చెందిన వ్యక్తి హత్య కేసులో ఐదుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ వెల్లడించారు. పిఠాపురం పట్టణ శివారులోని ఆర్వోబీ సమీపంలో గల వాసంశెట్టి పెద్దిరాజు పొలంలో తల, శరీరంపై గల గాయాలతో మరణించి ఉన్నట్టు వీఆర్వో కామేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 8న పిఠాపురం పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో పట్టణ, రూరల్, కొత్తపల్లి ఎస్ఐలు మణికుమార్, జానీ బాషా, వెంకటేష్ ఆధ్వర్యంలో 3 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు, సీసీ పుటేజీలు, సాక్షుల కథనాల ఆధారంగా విచారణ సాగించి మృతుడిని తమిళనాడు రాష్ట్రంలోని తేని జిల్లా మైలాడంబారై ప్రాంతంలోని కొమనపంతుల పంచాయతీ మనుతు గ్రామానికి చెందిన పాండేగా గుర్తించారు. ఇతడు హనుమాన్ జంక్షన్ ప్రాంతంలోని తినుబండారాల తయారీ ఫ్యాక్టరీలో పని చేసేవాడు. ఇతడికి అక్కడ తమిళనాడు రాష్ట్రం తూతికూడి జిల్లా పెరియసామిపురం ప్రాంతానికి చెందిన పౌల్‌రాజ్ ఆండోనీ, లార్డు పకియం, మేల్మండా గ్రామానికి చెందిన మడసామి కారుప్పస్వామితో పరిచయం ఏర్పడింది. వీరు అక్కడే పనిచేసే పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన పూచి ధనలక్ష్మి (ధనమ్మ) భర్త రామస్వామికి ఆరోగ్యం బాగోలేక పోవడంతో పరామర్శకు వచ్చారు. అక్కడ పాండే ధనమ్మతో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు చెప్తున్నారు. దీంతో 7వ తేదీ రాత్రి ఆండోని, ధనమ్మ, పకియం, సామి, పిఠాపురం మండలం మాధవపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చాగంటి గణేష్‌తో కలిసి పాండేను హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. వీరిని కొత్తపల్లి గ్రామ శివారులో అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. కాగా హత్యకు గల కారణాలపై పోలీసులు చెప్తున్న వివరాలపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గంజాయి విషయంలో వారి మధ్య జరిగిన ఘర్షణే హత్యకు దారి తీసినట్టు సమాచారం. ఇదే విషయం పట్టణంలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది.

దర్జా దొంగ దొరికాడు!

- పోలీసుల అదుపులో కార్ల దొంగ
- నిందితుడు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం వాసి
- ఏప్రిల్‌లో ఇంద్రకీలాద్రిపై ఓం టర్నింగ్ వద్ద చోరీ
- 241 గ్రాముల బంగారు ఆభరణాలతో ఉడాయింపు
- తునిలో పట్టుకున్న పోలీసులు.. విజయవాడకు తరలింపు

ఇంటి దగ్గర నుంచి దర్జాగా కారులో బయల్దేరుతాడు. ఆలయాల వద్ద నిలిపిన కార్ల వద్ద అటూ ఇటూ తిరుగుతాడు. ఆయుధం పట్టకుండా చేత్తో కారు తలుపులు తెరుస్తాడు. ఆభరణాలు, నగదును చిటికెలో మాయం చేస్తాడు. భక్తుల కార్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): అమలాపురానికి చెందిన ఆచంట దుర్గ కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. అమలాపురంలో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు ఏప్రిల్ 15న బయల్దేరిన ఈ కుటుంబం దారిలో దుర్గమ్మ దర్శనం చేసుకోవాలనుకుంది. ఇంద్రకీలాద్రిపై ఓం మలుపు వద్ద కారును నిలుపుదల చేసి, డోర్ లాక్ చేసుకుని దర్శనానికి వెళ్లారు. ఈ కారులో నుంచి 241 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. తిరిగి వచ్చి చూసేసరికి ఆభరణాలు కనిపించలేదు. అక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎలాంటి ఆధారాలు లభించలేదు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇలా చిక్కాడు..

కాకినాడ జిల్లా తుని రూరల్ మండలం తలుపులమ్మ లోవలో భక్తుల కార్లను టార్గెట్ చేసుకుని చోరీలు చేస్తున్న వ్యక్తిని తుని రూరల్ పోలీసులు కొద్దిరోజుల క్రితం అరెస్టు చేశారు. ఆ సమయంలో కొంత బంగారాన్ని అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో విచారణ చేస్తుండగానే ఇంద్రకీలాద్రిపై కారులో చేసిన చోరీ బయటకు వచ్చింది. నిందితుడి స్వస్థలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం. అక్కడి నుంచి కారులో బయల్దేరి చోరీలు చేసుకున్నాక తిరిగి వెళ్లిపోతాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఉన్నత విద్యాభ్యాసం చేస్తుండగా, కుమారుడు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. దొంగిలించిన వస్తువులను అదే గ్రామానికి చెందిన ఓ బంగారం వ్యాపారికి విక్రయించాడు. మహారాష్ట్రకు చెందిన ఆ వ్యాపారి వద్ద నుంచి పలు చోరీలకు సంబంధించిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కారుతో పాటు విజయవాడ తరలిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న సమాచారం తెలియడంతో బంగారం వ్యాపారి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడి కోసం ప్రత్యేక బృందం గాలిస్తోంది. నిందితుడి వయస్సు 45 ఏళ్లు ఉంటుంది. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల వద్ద పలు చోరీలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఇంద్రకీలాద్రిపై ఎన్ని చోరీలు చేశాడు, ఉమ్మడి జిల్లాల్లో ఏయే ఆలయాల వద్ద ఈ తరహా దొంగతనాలు జరిగాయి.. అనే వివరాలు విచారణలో బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

యానాంలో భారీ వర్షం

రోడ్లు జలమయం

యానాం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయం అయ్యాయి. భారీఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం, ఈదురుగాలులతో పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. క్రీడా ప్రాంగణాలు చెరువులను తలపించాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సమీపంలో వర్షంనీరు నిలిచిపోయింది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. పిల్లారాయస్వామి ఆలయం, పోలీస్‌స్టేషన్ సముదాయాలు నీటమునిగాయి. ముంపు ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థను యానాం పరిపాలనాధికారి అంకిత్ కుమార్ అధికారులతో కలసి పర్యవేక్షించారు.



వర్షం నీటిలో వెళ్తున్న విద్యార్థులు

తాండవ నదిలో బాలుడు గల్లంతు



స్వరాజ్(ఫైల్)

తుని రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో తాండవ నదిలో 11 ఏళ్ల బాలుడు గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం.. తుని పట్టణంలోని రాజీవ్ గృహకల్పకాలనీకి చెందిన మాకిరెడ్డి స్వరాజ్ (11), బావిశెట్టి గణేష్ (14) బుధవారం ఉదయం తుని శివారు కాత్రావుల వద్ద తాండవ నదిలో స్నానానికి దిగారు. ఇద్దరు బాలురు గల్లంతవుతుండగా ఇది గమనించి స్థానికులు ఒకరిని కాపాడారు. మాకిరెడ్డి స్వరాజ్ (11) అనే బాలుడు గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. గత ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కానీ స్వరాజ్ ఆచూకీ ల భించకపోవడంతో అతడి కుటుంబ సభ్యు లు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



తాండవ నదిలో గాలింపు దృశ్యం

సెపక్‌తక్రా జట్టు రాష్ట్ర కోచ్‌గా గౌతమ్



యాండ్ర గౌతమ్

అమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23 నుంచి 27వరకు సీనియర్ పురుష, మహిళల జాతీయస్థాయి సెపక్‌తక్రా క్రీడా పోటీలు గోవాలోని మాగ్గోస్ ప్రాంతంలో జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రం తరఫున పురుష జట్టు కోచ్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన కానిస్టేబుల్, ఎన్ఐఎస్ఎన్ఐఎస్ కోచ్ యాండ్ర గౌతమ్‌ను నియమించినట్టు కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసులు ఈ మేరకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌ను ఎస్పీ రాహుల్‌మీనా, అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ అభినందించారు.

రోడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

● పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకాలపై సమీక్షా సమావేశంలో కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరంరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణాల విషయంలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గ్రామీణ మౌలిక సదుపాయాలకల్పన రహదారులు, పారిశుధ్యం మెరుగుదల, సంక్షేమ రంగాల బలోపేతం ప్రధాన లక్ష్యం అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, ఉపాధి హామీ నిధుల ద్వారా జరుగుతున్న లభివృధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో రూ.238.14కోట్ల అంచనాతో 922 పనులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటివరకు 47 పనులు పూర్తికాగా, 68పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇంకా 808 పనులు ప్రారంభించాల్సి వుందన్నారు. నిర్మించిన రహదారుల నాణ్యతపై తప్పనిసరిగా ఆడిట్ నిర్వహించాలన్నారు. భారీవాహనాల రాకపోకలు వున్న ప్రాంతాలలో బలమైన దీర్ఘకాలిక రహదారులను నిర్మించాలన్నారు. పీఎంజీఎస్వై పథకం కింద రూ.717కోట్ల వ్యయంతో రెండు పనుల మంజూరుకాగా ఒకటి పూర్తయి మరొకటి పురోగతిలలో ఉందన్నారు. నాబార్డ్ పథకం కింద మంజూరైన13 పనులలో 10 పనులు కొనసాగుతున్నాయని మిగిలిన 3 పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. గోపాలపురం నియోజకవర్గం పరిధిలో 7సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు మరమ్మతుల కింద రూ.1.24కోట్లతో మంజూరైన 7పనులకు సంబంధించి 3 పూర్తయ్యాయన్నారు. 3 పనులు కొనసాగుతుండగా 1 ప్రారంభ దశలో వుందన్నారు, ఎంపీ ల్యాండ్స్ పథకం కింద రూ.6.25 కోట్ల అంచనా వ్యయంతో 6 పనులు మంజూరు కాగా అందులో 2 పూర్తయ్యాయని, రెండు పనులు కొనసాగుతుండగా 18పనులు ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.బాలకృష్ణ డ్వామా ఏపీడీ బి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

నెట్‌వర్కు ఆసుపత్రులకు బకాయిలు తక్షణమే చెల్లించాలి

● సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆషా, ఐఎంఏ ప్రతినిధులు, వైద్యుల ధర్నా

రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ బకాయిలు తక్షణమే చెల్లించాలని ప్రైవేట్ నెట్‌వర్కు ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆషా రాష్ట్ర అధ్యక్షుడు కె.విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్కు ఆసుపత్రులకు దాదాపు రూ.3,000 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని, వీటిలో సీఎంఎఫ్ఎస్‌లో ఉన్న రూ.670 కోట్లను వెంటనే చెల్లించాలని కోరుతున్నామన్నారు. మిగిలిన బకాయిలను రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నిర్ణీత గడువులో చెల్లించాలని అడుగుతున్నామని అన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న యూనివర్శల్ హెల్త్ స్కీమ్‌లో తమను భాగస్వాములని చేయమని కోరుతున్నామన్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈనెల 10వ తేదీ నుంచి అత్యవసర సేవలు సైతం నిలిపివేశామన్నారు. ప్రభుత్వ రూల్స్ వ్యతిరేకించడం, విమర్శించడం తమ ఉద్దేశం కాదన్నారు. ఇది మా బల ప్రదర్శన కాదు, ఆవేదన మాత్రమే అన్నారు. మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో నుంచి రూ.250 కోట్లు ఇస్తాం, మహాధర్నా ఆపేయమని సమాచారం వచ్చిందని, దీనికి సభ్యులు ఒప్పుకోలేదు. గురువారం విజయవాడలో ధర్నాచౌక్‌లో మహాధర్నా చేపడతామని వెల్లడించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు పి.విజయభాస్కర్ మా2323ట్లాడుతూ ఆరోగ్యశ్రీ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. నెట్‌వర్కు ఆసుపత్రుల సమస్యలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, ఇది సరికాదన్నారు. ఈ ధర్నాలో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు


అదృశ్యమైన వృద్ధుడు రామారెడ్డి

అనపర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన సబ్బెళ్ళ రామారెడ్డి అనే వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ సుజాత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మహేంద్రవాడ గ్రామానికి చెందిన సబ్బెళ్ళ రామారెడ్డి అనే 85ఏళ్ల వృద్ధుడు ఈనెల 12వ తేదీన కొప్పవరం రోడ్డులో ఉన్న వ్యవసాయ క్షేత్రానికి వెళ్ళి తిరిగి రాలేదని తెలిపారు. బంధువుల ఇంట వెతికినా ఫలితం లేకపోవడంతో అనపర్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదు చేశామన్నారు. రామారెడ్డి కుమారుడు సూరారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

గోదావరి టూరిజం కారిడార్‌కు ఏర్పాట్లు

● బీజేపీ జిల్లా నాయకుడు ఏపీఆర్ చౌదరి

సీతానగరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు గోదావరి టూరిజం కారిడార్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని జిల్లా బీజేపీ నాయకుడు ఏపీఆర్ చౌదరి తెలిపారు. బుధవారం సీతానగరం ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆంధ్రప్రదేశ్‌కు సౌభాగ్యమని, గోదావరి టెంపుల్ టూరిజం కారిడార్ రాష్ట్రానికి శోభాయమానమని అన్నా రు. ఇందుకుగాను అఖండ గోదావరి ఎడమ గట్టును అభివృద్ధి చేసి రాజమండ్రి నుంచి పురుషోత్తపట్నం వరకు టూరిజం కారిడార్ అభివృద్ధి కోసం ఇప్పటికే ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజుల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని అన్నారు. త్వరలో బిజెపి. పార్టీద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించి స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి సహకారంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు

అంతర్జాతీయ సైన్స్ సెమినార్‌లో

రంగంపేట విద్యార్థినికి కాంస్య పతకం


మలేషియాలో విద్యార్థిని రమ్య,ఉపాధ్యాయిని రమ్య సుధకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న దృశ్యం

రంగంపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సైన్స్ సెమినార్‌లో రంగంపేటజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అవుపాటి రమ్య ప్రతిభ చూపిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ ఈనెల 18,19 తేదీలలో మలేషియా దేశంలో ఎంఎంయు సైబర్జియా వేదికగా నిర్వహించిన సైన్స్ కాస్టిల్ ఆసియా అనే అంతర్జాతీయ సైన్స్ సెమినార్ అండ్ ప్రాజెక్టు ప్రదర్శనలో రష్యా, జపాన్‌లతో సహా ఆసియాకు చెందిన 10 దేశాలు పాల్గొన్నాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు 2000కుపైగా దరఖాస్తులు ఆసియా దేశాల నుంచి రాగా 393 ప్రాజెక్టులను పోటీలలో ప్రదర్శించేందుకు ఎంపిక చేయగా తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని అవుపాటి రమ్య, పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని రమ్యసుధతో కలిసి రూపొందించిన స్టూడెంట్ ఫ్రెండ్లీ పెన్ అనే ప్రాజెక్టు పోటీలలో పాల్గొనేందుకు భారతదేశం తరఫున అర్హతపొంది కాంస్య పతకాన్ని సాధించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో చక్కటి ప్రతిభ కనబర్చినందుకు విద్యార్థిని ర మ్యను, ఉపాధ్యాయిని రమ్యసుధను ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, పాఠశాల హెచ్ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట


కడియంలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రసాద్


అనపర్తిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి

కడియం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తెలిపారు. ఎస్‌జీఎఫ్ఐ, మండల స్థాయిలో అండర్-17 వాలీబాల్ క్రీడాపోటీలు బుధవారం కడియంలో జరిగాయి. ఈ క్రీడాపోటీలను ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ఎస్ఎంసీ చైర్మన్ గారపాటి సత్య, గారపాటి తాతబాయి, గ్రీన్‌లాండ్ బాబి, చిలుకూరి ప్రభ, ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. మండలంలో ఉన్నతపాఠశాలల నుంచి 120మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమస్థానం (జేగురుపాడు), ద్వితీయస్థానం (మురమండ) జట్లు నిలవగా, బాలికల విభాగంలో ప్రథమ స్థానం (కడియం), ద్వితీయస్థానం (కడియపులంక) జట్లు నిలిచాయని మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎం. డేవిడ్ తెలిపారు.

క్రీడాభివృద్ధి ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అనపర్తి(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సౌకార్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు, ఎంపికలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించి పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మల్లిడి ఆదినారాయణరెడ్డి, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, డివిజనల్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి మండల కోఆర్డినేటర్ టీవీవీఎస్ రాఘవరెడ్డి, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్య జీవితకాల ప్రక్రియ

● కళాశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ కృష్ణాజీ


మాట్లాడుతున్న కృష్ణాజీ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్య జీవితకాల ప్రక్రియ అని, జ్ఞానంతోపాటు నైపుణ్యాలు, జీవిత అనుభవాలను, వివేకాన్ని నేర్పుతుందని కళాశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ పీవీ కృష్ణాజీ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్షారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణాజీ మాట్లాడుతూ విద్య మనలోని అంతర్గత జ్ఞానాన్ని వెలికి తీసి ఉత్తమ సమాజ పౌరులుగా తీర్చిదిద్దుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వంతో పాటు సామాజిక స్పృహను పెంచుకోవాలని అన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ వై.స్వర్ణశ్రీ పాల్గొన్నారు.

అనపర్తిలో జన్మభూమి హాల్ట్‌కు రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్

● త్వరలో తేదీని ప్రకటించనున్న రైల్వేశాఖ

● ఫలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కృషి


గతంలో ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌ను ఎంపీ పురందేశ్వరితో కలిసి జన్మభూమి హాల్ట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనపర్తి వాసులకు చిరకాల వాంఛగాఉన్న జన్మభూమి హాల్ట్‌కు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే నిలుపుదల తేదీని ప్రకటిస్తామని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. అనపర్తి వాసులకు కలగా మిగిలిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కోసం గత ఎన్నికలలో ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. హామీని నిలబెట్టుకునేందుకు ఇరువురు నేతలు చేసిన కృషికి ఫలితం దక్కింది. ఈఏడాది జూలై 25న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌ను ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కలిసి జన్మభూమి హాల్ట్ కోసం వినతిపత్రం అందజేశారు. దీంతో రైల్వే మంత్రి అనపర్తిలో జన్మభూమి హాల్ట్‌కు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హాల్ట్ ప్రారంభ తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన ఉత్వర్వులలో ప్రకటించారు. దీంతో అనపర్తి ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనపర్తివాసులకు చిరకాల వాంఛగా మిగిలిన జన్మభూమి హాల్ట్‌ను సాధించడం ఆనందంగా ఉందని, కృషి చేసిన ఎంపీ పురందేశ్వరికి, రైల్వే మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అనపర్తిలో జన్మభూమికి హాల్టుపై బీజేపీ హర్షం

రాజమహేంద్రవరం అర్బన్,(ఆంధ్రజ్యోతి) : జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అనపర్తి రైల్వే స్టేషన్‌లో హాల్టు సాధించిన రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు.

అత్యాచార ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) :సంక్షేమ హాస్టల్‌లో విద్యనభ్యసిస్తున్న బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, కిడ్నాప్ కేసు కూడా పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సంక్షేమ హాస్టళ్లలో బాలికలకు రక్షణ కొరవడిందని తెలిపారు. బాలిక ఫిర్యాదు చేసేంతవరకూ హాస్టల్ అధికారులు విచారణ చేపట్టకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయని, ఈనేపథ్యంలో దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

● అధికారుల నిర్లక్ష్యంవల్లే : రిపబ్లికన్ పార్టీ

హాస్టల్ వార్డెన్, సంక్షేమ అధికారుల నిర్లక్ష్యం వల్లే బాలికల హాస్టళ్లలో ఇటువంటి విచారకర సంఘటనలు జరుగుతున్నాయని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నం రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలికల రక్షణ విషయంలో నిర్లక్ష్యం చూపిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాలికల హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, బాలికపై అత్యాచార ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇది హేయమైన చర్య, తీవ్రంగా ఖండిస్తున్నాం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : హాస్టల్ బాలికపై అఘాయిత్యం సంఘటన హేయమైనదని, తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన పార్టీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన తమ పార్టీ నాయకులతో కలిసి రాజమహేంద్రవరం జీజీహెచ్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంలో హాస్టల్ వార్డెన్ తప్పు కూడా ఉందని తాము భావిస్తున్నామని అన్నారు. బాలికకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. సంఘటనకు సంబంధించి ఇప్పటికే ఇద్దరిపై కేసులు నమోదు చేస్తామని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని అన్నారు.

తప్పు ఎవ్వరు చేసినా ఉపేక్షించం

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సాంఘిక సంక్షేమ వసతిగృహంలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యంపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ ప్రభుత్వం ఈ సంఘటనను చాలా తీవ్రంగా పరిగణించిందని, తప్పు ఎవ్వరు చేసిన కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. కాకినాడ ప్రాంతానికి చెందిన బాలిక రాజమహేంద్రవరం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి చదువుతుందని ఈనెల 20న సాయంత్రం 5గంటల సమయంలో జొన్నాడకు చెందిన అజయ్ అనే యువకుడు హాస్టల్‌కు వచ్చాడని, అయితే బాలిక తన బంధువుల అబ్బాయి అన్న వచ్చాడని బయటకు వెళ్లి స్టేషనరీ కొనుగోలు చేసుకుని వస్తానని వార్డెన్‌ను పరిమిషన్ అడిగిందన్నారు. వార్డెన్ అనుమతించడంతో ఆబాలిక బయటకు వెళ్లిందని తిరిగి రాత్రి 7 గంటలకు ఆ బాలికను అజయ్ బైక్‌పై వసతిగృహం వద్ద దించి వెళ్లాడన్నారు. కొద్దిసేపటి తర్వాత ఆ బాలికను వార్డెన్ గమనించి ఒంటిపై ఉన్న గాయాలను చూసి నిలదీయగా జరిగిన విషయం ఆ బాలిక వార్డెన్‌కు చెప్పిందన్నారు. అజయ్ అనే యువకుడు బయటకు తీసుకువెళ్లి తనపై అఘాయిత్యం చేశాడని దానికి మరొక యువకుడు సహకరించాడని చెప్పడంతో హాస్టల్‌వార్డెన్ వెంటనే బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పి సంఘటన జరిగిన ప్రదేశం టూటౌన్ పరిధిలో కాబట్టి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సంఘటన దారుణమన్నారు. ఎవ్వరుపడితే వారు వచ్చి తన అన్న అని చెబితే అలా ఎలా వసతి గృహం నుంచి బయటకు పంపిస్తారని దీనిపై జిల్లాకలెక్టర్‌తో మాట్లాడానని చెప్పారు. గణేష్‌చౌక్ వసతి గృహం వద్ద నిత్యం రద్దీగా ఉంటుందని వసతి గృహం సీసీ కెమెరా ఏర్పాటుచేయాలని గతంలో పోలీసులకు చెప్పానన్నారు. కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదన్నారు. వసతి గృహంలో సమస్యలపై ఏనాడు పట్టించుకోని వైసీపీ మాజీ ఎంపీ ఇప్పుడు బాలికపై అఘాయిత్యం జరిగితే దానిని రాజకీయం చేయాలనుకోవడం సరికాదన్నారు. ఇప్పటికే వైసీపీ వాళ్లు వసతి గృహంవద్ద ఆందోళనకు దిగి బాలికలను భయాందోళనకు గురిచేశారని తాను వసతి గృహంవద్దకు వెళ్లి బాలికను ఇబ్బంది పెట్టకూడదని ఆగానన్నారు. తమ తెలుగు మహిళలు, గణేష్‌చౌక్ డివిజన్ ఇంచార్జి మాజీ కార్పొరేటర్‌ల బృందం వసతి గృహానికి వెళ్లి బాధిత బాలికతో మాట్లాడతారని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, టీడీపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ మొకమాటి సత్యనారాయణ, టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ద్వారా పార్వతి సుందరీ, జిల్లా అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, కార్యదర్శి మీసాల నాగమణి, నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, అంగన్‌వాడి కమిటీ కన్వీనర్ కప్పల వెలుగు కుమారి తదితరులు పాల్గొన్నారు.

3న మున్సిపల్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి


మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మునిసిపల్ వర్కర్స్ యూనియన్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అందుకే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నవంబరు 3 నుంచి కార్మికుల సమ్మెను నిర్వహిస్తున్నామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు తెలిపారు. బుధవారం దేవీచౌక్ నుంచి కార్మికులతో నిరసన ప్రదర్శనగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంవద్దకు చేరుకుని మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ నిరంతరం ప్రజల ఆరోగ్యం కోసం పనిచేసే మున్సిపల్ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ జట్టు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంబాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దుర్గమ్మ, జిల్లా నాయకులు శారద, పోలమ్మ, గిరి శ్రీను పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

బిక్కవోలు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభంకావడంతో మండలంలోని శివాలయాలన్నీ శివనామస్మరణతో బుధవారం మార్మోగాయి. బిక్కవోలులోని సామర్లకోట కాలువలో కార్తీకస్నానాలు ఆచరించి, దీపాలు వదిలిన భక్తులు గ్రామంలోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకోవడానికి తెల్లవారుజాము నుంచి బారులు తీరారు. ఈసందర్భంగా స్వామికి పంచామృతాలతోను, పాలతోను అర్చకులు అభిషేకాలు చేశారు. మండలంలోని బలభద్రపురంలోని ద్వాదశజ్యోతిర్లింగాలను, ఇళ్లపల్లిలోని 108 స్తంభాల గుడిలోని పాదరస లింగాన్ని దర్శించుకోవడానికి బారులు తీరారు.

36వ అఖండ నామ జపయజ్ఞం

కోరుకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలంబూరుగుపూడి ద్వారకాషిర్డీ సాయిబాబా ఆలయంవద్ద బుధవారం కార్తీక మాసం సందర్భంగా 36వ ఓం శ్రీ సాయిరాం అఖండ నామ జప యజ్ఞం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అంతకుముందు రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ ఆలయంలో కలశ స్థాపనచేసి అఖండ నామ జపయజ్ఞంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రతి గంటకు ఒక బ్యాచ్ చొప్పున 24గంటలు పాటు 24 బ్యాచ్‌లు మొదటిరోజు అఖండ నామ జయ యజ్ఞం నిర్వహించారు. గురుదేవులు మామిడిపల్లి రామారావు ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా కార్తీకమాసం నెల రోజులు 24గంటలు పాటు ఈఅఖండ నామ జప యజ్ఞం నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగ కేశవరావు, మాజీ సర్పంచ్ వి.వీరవెంకట సత్యనారాయణ, గోడపాటి వెంకటేశ్వరరావు, గణపతి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస మహోత్సవాలు ప్రారంభం

పవిత్ర కార్తీక మాసం సందర్భంగా కోరుకొండ హరేరామ సమాజంలో బుధవారం 63వ కార్తీక మాసమహోత్సవాలు సమాజ అధ్యక్షుడు కలిపివాయి నమఃశివాయ శర్మ ప్రారంభించారు. ఉదయం స్వామివారికి ప్రభాత సేవ, ప్రత్యేక అర్చన జరిగింది అనంతరం నగర సంకీర్తన హరేరామ స్వామికి విష్ణు సహస్ర నామ పూజలు, పారాయణం, భజనలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మిరియాల వెంకటశేష త్రిమూర్తులు, ఇతర కమిటీసభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గుడా మాజీ చైర్మన్ గన్నికృష్ణ


కలెక్టర్ కీర్తి చేకూరికి మొక్కను అందిస్తున్న గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టరేట్‌కు వెళ్లిన ఆయన కలెక్టర్‌ను కలిసి మొక్కను అందించారు. అనంతరం జిల్లాలో ఉన్న సమస్యలు పరిష్కరించి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కలెక్టర్‌కు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఉన్న ఆటంకాలు, ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యిన్నమూరి రాంబాబు, టీడీపీ నాయకులు కంటిపూడి శ్రీనివాస్, మరుకుర్తి రవియాదవ్, మళ్ళవెంకట్రాజు, జక్కంపూడి అర్జున్ పాల్గొన్నారు.

బరియల్ గ్రౌండ్‌కు మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం గ్రామంలో బరియల్‌గ్రౌండ్‌లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రహరీగోడ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పాస్టర్స్ అసోసియేషన్, క్రిష్టియన్ బరియల్ గ్రౌండ్ అడ్వజయిరీ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం లాలాచెరువు శాంతి మందిరంలో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు పొన్నమాటి బాబ్జి మాట్లాడారు. మానవుడి అంతిమ యాత్రను అడ్డుకోవడం దారుణమన్నారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు తమ వాహనాలను అడ్డుకోవడంతోపాటు బరియల్ గ్రౌండ్ స్థలంలో రోడ్డు నిర్మాణం చేయడంపట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దృష్టికి తీసుకుని వెళతామన్నారు. బిషప్‌లు జి.ప్రభాకర్, పి.సుందరరాజు, టి.ఆర్థర్ ప్రసాద్, పి.రాజేంద్రప్రసాద్, కె.శాంతారావు పాల్గొన్నారు.

దేశంలో బీజేపీ పాలనతో కేంద్ర సంస్థలు నిర్వీర్యం

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి

అనపర్తి అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ పాలన చేపట్టిన నాటి నుంచి కేంద్రంలోని ప్రధాన సంస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని ఎన్నికల కమిషన్, సీబీఐ వంటి సంస్థలు ప్రధాని మోదీ గుప్పెట్లో ఉన్నాయని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. కాంగ్రెస్‌పార్టీ పిలుపుమేరకు ఓట్ చోర్ గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు అనపర్తిలో ర్యాలీ నిర్వహించి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ మోదీ ప్రధాని అయిన తరువాత 324 లక్షల కోట్ల అప్పు చేశారని అన్నారు. మహారాష్ట్ర, బీహార్, కర్నాటకలోను ఓట్ల చోరీ జరిగిందన్నారు. మోదీ ప్రధాని అయిన తరువాత ఒక్క సంస్థను కూడా తీసుకురాలేదని ఉన్న సంస్థలను ప్రైవేటు పరంచేసి దేశాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సత్తి బులిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డి రామారావు, ఆనందకుమార్, కర్రి రామారెడ్డి, తేతలి త్రినాదరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేనెల 29న ఏపీపీఎంపీ, ఆర్ఎంపీల బహిరంగ సభ

రాజమహేంద్రవరంకల్చరల్, అక్టోబరు22((ఆంధ్రజ్యోతి): స్థానిక కెఎస్ఆర్ హాస్పిటల్‌లో, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రాథమిక వైద్యులు బుధవారం సమావేశమయ్యారు. నవంబరు 29న ఉమ్మడి జిల్లా గ్రామీణ వైద్యుల గుర్తింపు, వృత్తి పరిరక్షణే ధ్యేయంగా ఏపీ రాష్ట్ర పీఎంపీ, ఆర్ఎంపీల జాయింట్ యాక్షన్ కమిటీ పక్షాన సుమారు 3వేల మంది సభ్యులతో భారీ మహాసభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు కంబాల బాబూరావు, కెగణపతిరావు, ఎండీ రఫీ, లంక సత్యనారాయణ, తోరాటి ప్రభాకరరావు, నిడమర్తి సత్తిరాజు, బళ్ళ శ్రీనివాస్, ఎంవీరాజు, చిక్కాల రామచంద్రరావు, డీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకలు

బిక్కవోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ తెలిపారు. కొమరిపాలెంలో శ్రీవరలక్ష్మి గణపతి శిల్పి సంక్షేమ సంఘ 4వ వార్షికోత్సవ కార్తీక వనసమారాధనలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన సంఘ సభ్యు లు, వారి అభిమానులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్య క్షుడు డీవీఆర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం

రాజానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోకాడలోని శ్రీవేంకటేశ్వరస్వామి, రామాలయానికి విశ్వహి ందూ ధర్మరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస రావు రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాత కంబాల మాట్లాడుతూ గ్రామంలోని ఆయా ఆలయాల అభివృద్ధిలో భాగంగా కమిటీ సభ్యులు, గ్రామస్థులు గతంలో కోరిన మీదట కమిటీ సభ్యులు నల్లమిల్లి సుబ్బారావు, మేడిద గంగరాజు, యాళ్ల వీరబాబు ఆధ్వర్యంలో బుధవారం అందజేశామన్నారు.

ప్రభాస్ అభిమానుల రక్తదానం

రాజమహేంద్రవరంకల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకుని ప్రభాస్ ఫా న్స్ సిటీ ప్రెసిడెంట్ దేవీప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభాస్ అభిమానులు రక్తదానం చేశారు. స్థానిక తాడితోటలోని సంహిత ఫం క్షన్ హాల్లో జరిగిన ఈ రక్తదానం కార్యక్రమానికి సుమారు 200 మంది హాజరై రక్తదానం చేసినట్లు దేవీప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అత్తి సత్యనారాయణ,మజ్జి రాంబాబు,కోసూరి చండీప్రియ,కప్పల వెలుగు కుమారి,కొయ్యాన కుమారి, బొర్రా చిన్ని, మహేష్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

బిట్టూ మృతి పార్టీకి తీరనిలోటు

● జనసేన నేత మర్రెడ్డి శ్రీనివాసరావు

బిక్కవోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్ ఎస్.పేటకు చెందిన జనసైనికుడు బిట్టూ మృతి పార్టీకి తీరని లోటని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన అకాల మరణం పొందిన బిట్టూ కుటుంబ సభ్యులను పరామర్శించి జనసైనికు లు సమకూర్చిన రూ.లక్ష నగదును బిట్టూ తల్లికి అందజేశారు. ఈయన వెంట జనసేన నేతలు రావాడ నాగు, ఇందల వీరబాబు, గిరిజాల సత్తిబాబు, ఎస్ఆర్‌కె.ప్రసాదరెడ్డి, యా నాల కొండయ్య, తోట సతీష్, ముప్పిన వెంకటరమణ, గుత్తుల శివకొండబాబు, వడ్లమూరి గోవిందరాజు, కర్రి శ్రీను, నూతంగి ప్రసాద్ కూటమి నేతలు పాల్గొన్నారు.





కార్తీకం..ఆరంభం



రాజమహేంద్రవరం
పుష్కరఘాట్ వద్ద భక్తుల రద్దీ..
కార్తీక దీపాలతో దంపతులు

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరి నదీతీరం కార్తీక పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. బుధవారం వేకువజామున 2:30 గంటల నుంచి భక్తులు పెద్దఎత్తున నగరంలో పుష్కరాల రేవు, కోటిలింగాల రేవు, పద్మావతి ఘాట్, టీటీడీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, కొవ్వూరు ఘాట్‌లలో భక్తులు గోదావరి స్నానాలు ఆచరించారు. కుటుంబాలతో రేవులకు చేరుకుని భక్తిశ్రద్ధలతో స్నానాలు చేశారు. అటుపై రేవులో పిండిముగ్గు వేసి దానిలో పసుపు, కుంకుమ దిద్ది, తమలపాకులో పసుపుముద్దతో దేవుడి ప్రతిమ చేసుకుని పిండి ప్రమిదల్లో దీపం వెలిగించుకుని మహిళలు పూజ చేశారు. కార్తీక దీపాలను గోదావరినదిలో విడిచి పెట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో రేవులన్నీ కిక్కిరిశాయి. భక్తజనం రేవులు సమీపంలోని దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద, నందీశ్వరుడి వద్ద దీపాలు వెలిగించారు. జిల్లా వ్యాప్తంగా శివాలయా లు కార్తీక శోభతో ప్రజ్వరిల్లాయి. ధవళేశ్వరం రామపాదాల రేవు భక్తులతో కిటకిటలాడింది.



ఆర నీకుమా..ఈ దీపం



కాటేసిన కామాంధులు!

కామాతురాణాం నభయం..నలజ్జ..
కామంతో కళ్లు మూసుకుపోయిన వాడికి సిగ్గు ఉండదు.. భయం ఉండదు..
ప్రస్తుతం సమాజంలో పరిస్థితి అలాగే ఉంది.. వావి వరుసలు మర్చిపోతు న్నారు.. కామాంధులైపోతున్నారు..
రాజమహేంద్రవరం, తునిలో జరిగిన రెండు ఘటనలే అందుకు ఉదాహరణ.
ఒకడు అన్నను అంటూ హాస్టల్ వార్డెన్‌కి మాయమాటలు చెప్పి బాలికను తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు..
మరొకడు తాతయ్యను అంటూ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు..
ఈ రెండు ఘటనలు బాలికల భద్రతను ప్రశ్నిస్తున్నాయి..

8

ఏసీబీ పేరుతో మోసగిస్తున్నారు జాగ్రత్త

డీఎస్పీ కిషోర్ కుమార్

రాజమహేంద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కొందరు దుండగులు తాము ఏసీబీ అధికారులమంటూ ప్రభుత్వ ఉద్యోగులను ఫోన్ ద్వారా మోసగించే ఘటనలు జరగడం తమ దృష్టికి వచ్చిందని ఏసీబీ డీఎస్పీ కిశోర్ కుమార్ తెలిపారు. ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం, బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ ఉద్యోగులకు ఆదివారం ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి 'మీపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. దాడులు జరగకుండా ఉండాలంటే డబ్బులివ్వాలి' అని మాట్లాడారన్నారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగాయన్నారు. ఈ కాల్స్‌కు ప్రభుత్వ ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించ వద్దన్నారు. ఆ ఫోన్లపై వెంటనే సంబం ధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయా లన్నారు.ఫోన్ నెంబర్లు 94404 46160, 08832 467 833కి సమాచారం ఇవ్వాలన్నారు.

96 పాఠశాలల్లో ఆధార్ నవీకరణ : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 96 పాఠశాలల్లో ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ ప్రత్యేక శిబిరాలను ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. 5 నుంచి 17 ఏళ్ల మధ్య వయసు కలిగిన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో ప్రధానంగా పెండింగ్ ఎంబీయూలపై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఆధార్ రికార్డులో వేలి ముద్రలు, ఐరిస్ స్కాన్, ఫొటోను తప్పనిసరిగా అప్‌డేట్ చేయడాన్ని ఎంబీయూ అంటారన్నారు. ఎంబీయూ పూర్తి చేయడం వల్ల ప్రభుత్వ పథకాలు, స్కూల్ సర్వీసులు, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడం సులభతరం అవుతుందన్నారు. హెచ్‌ఎంలు, విద్యాధికారులు గడువు లోపుగా నవీకరణలను పూర్తి చేయడం లక్ష్యంగా చేసుకోవాలని ఆదేశించారు.

నేడు మునిరత్నం నాయుడు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపాధ్యక్షుడిగా ఆచార్య డి.మునిరత్నం నాయుడు గురువారం(నేడు) ఉదయం బాధ్యతలు స్వీకరిస్తారని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. బొమ్మూరులోని విశ్వవిద్యాలయంలో పదవీ బాధ్యతల కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

మూడేనా!

ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఇంకా ఏడాదే



- ఆరునెలల ముందే ఎన్నికలు?
- ముగిసిన నాలుగేళ్ల పదవీకాలం
- మూడు జిల్లాలకు మూడు జడ్పీలు
- వచ్చే ఏడాది నుంచి ముక్కలు
- విభజిత జిల్లాల్లో సర్దుబాట్లు
- పశ్చిమ నుంచి 10 జడ్పీటీసీలు
- ఓటర్ల జాబితాలపై కుస్తీ
- ఎంపీడీవోలు, రెగ్యులర్ పోస్టుల భర్తీ
- ఇప్పటికే జడ్పీ ఆస్తుల విభజనపూర్తి
- ఆదాయాలపై నివేదికలు సిద్ధం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో జడ్పీ విభజనకు సమయం ముంచుకొస్తోంది. వచ్చే ఏడాది నాటికి మూడు జిల్లాలకు మూడు జిల్లా పరిషత్‌లు ఏర్పాటు కాబోతున్నాయి. ప్రస్తుత ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఏడాది మాత్రమే కాల వ్యవధి మిగిలి ఉండడంతో కొత్త జడ్పీల ఏర్పాటుపై తాజాగా ఉద్యోగ వర్గాల్లో చర్చ మొదలైంది. గత నెలతో ఉమ్మడి జిల్లా పరిషత్‌కు నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయింది.మిగిలిన ఏడాది కాలానికి ఆరు నెలల ముందే ఎన్నికలు జరిగే అవకా శాలు కనిపిస్తున్నాయి. దీంతో తాజాగా అధికారులు విభజిత జిల్లాల ఆధారంగా ఓటర్ల జాబితా విభజనపై దృష్టిసారించారు.అటు ప్రభుత్వం సైతం రెగ్యులర్ పోస్టుల భర్తీ చేపడుతుండగా, మరో పక్క జడ్పీ ఆస్తుల లెక్క తేలిపోయింది.

మూడింటికి మూడు..

11 నెలల్లో కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలకు మూడు జడ్పీలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలో జిల్లా పరిషత్‌లకు 2021 లో ఎన్నికలు జరగ్గా సెప్టెంబరులో ఫలితాలు విడుదలయ్యాయి. దీంతో గత నెలలో ముగిసిన సెప్టెంబరుతో వీటికి నాలుగేళ్ల పదవీకాలం పూర్తయింది. అయితే జిల్లా పరిషత్‌లకు కొత్త పాలకవర్గాలకు ఏర్పడిన ఏడాది తర్వాత రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. అయితే న్యాయపరమైన చిక్కుల కారణంగా విభజిత జిల్లాలకు సైతం ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీనే కొనసాగించారు. దీంతో ఇప్పటికీ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే జిల్లా పరిషత్ సమావేశాలు జరుగుతున్నాయి. మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులు హాజరవుతున్నారు. ప్రస్తుత జడ్పీకి వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి ఐదేళ్ల పదవీ కాలం పూర్తికానుంది. దీంతో తదుపరి జరిగే జిల్లా పరిషత్ ఎన్నికలు మూడు కొత్త జడ్పీలు విభజించి నిర్వహించాల్సి ఉంది. త్వరలో జరగనున్న పంచాయతీలు, మునిసిపాలిటీలతో పాటే జడ్పీలకు ఎన్నికలు జరగొచ్చనే చర్చ జరుగుతోంది. దీనిపై ఎడతెగని చర్చ జరుగుతోంది. ఏడాదికంటే ముందుగానే ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న రాజధాని అధికారుల సంకేతాలతో ప్రస్తుతం జిల్లా పరిషత్ అధికారులు మూడు కొత్త జడ్పీల ఏర్పాటు, విభజిత జిల్లాల ప్రకారం ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంపై దృష్టిసారించారు.ఆరు నెలల్లో మూడు కొత్త జడ్పీలను ఏర్పాటు చేసే కసరత్తు ఫుంజుకోనుంది.

వాటిపై స్పష్టత ఎలాగో..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిషత్‌లో 62 మంది జడ్పీటీసీలు, 997 మంది ఎంపీటీసీలు ఉన్నారు.మూడు జిల్లాలకు సంబంధించి ఆయా మండలాల ప్రకారం ఏ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఏ జిల్లా పరిధిలోకి వస్తారనే దానిపై స్పష్టత ఉండడంతో దాని ప్రకారం అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమైన ఓటర్ల జాబితాను మండలాలవారీగా విభజించనున్నారు. గత వైసీపీ సర్కారు హయాంలో జిల్లాల విభజన గందరగోళంగా జరగడంతో ఇప్పటికీ వీటిపై ప్రజలనుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం విభజిత జిల్లాలపై వస్తోన్న అభ్యంతరాలపై మార్పులు చేర్పులు చేయడానికి ఇప్పటికే మంత్రులతో కమిటీని నియమించింది. ఇందులో భాగంగా కోనసీమ జిల్లాలోని మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని వినతులు వెల్లువెత్తాయి. రామచంద్రపురం నియోజకవర్గం మొత్తాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. కాజులూరు మండలం కాకినాడ జిల్లాలో ఉండడాన్ని గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమలను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. జిల్లాల విభజనలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గాన్ని ఉమ్మడి విశాఖ పరిధిలోని పాడేరు డివిజన్‌లో కలిపి అల్లూరి జిల్లాగా మార్చారు. ఈ నేపథ్యంలో రంపచోడవరంలోని 11 జడ్పీటీసీలు, ఇతర ఎంపీటీసీలను అల్లూరి జిల్లాలో కలపొద్దనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. లేదంటే తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సర్దుబాట్లు ఎలా ఉంటాయనేదాని ఆధారంగా కొత్త జడ్పీల ఏర్పాటు తుది రూపు సంతరించుకోనుంది.

ఆ మూడూ ఇటే..

ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలు తూర్పుగోదావరి జిల్లాకు కొత్తగా ఏర్పడే జిల్లా పరిషత్‌లోకి చేరనున్నాయి. ప్రస్తుతం జడ్పీలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కొనసాగుతున్న నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న నిడదవోలు,కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలోని జడ్పీటీసీలు ఏలూరులో జరిగే జడ్పీ సమావేశాలకు వ్యయప్రయాసలకోర్చి వెళ్లాల్సి వస్తోంది. అదే కొత్త జడ్పీలు ఏర్పడిన తర్వాత ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో జడ్పీటీసీలు రాజమహేంద్రవరంలో జరిగే జడ్పీ సమావేశాలకు హాజరవుతారు.ప్రధానంగా కొవ్వూరు,నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి విభజిత జిల్లాల ప్రకారం ఏర్పడే రాజమహేం ద్రవ రం జిల్లా పరిషత్‌లో ఈ మూడు నియోజక వర్గాల నుంచి పది మంది జడ్పీటీసీలు చేరనున్నారు.

కసరత్తు వేగంగానే..

కొత్తగా మూడు జడ్పీల ఏర్పాటుకు సంబంధించి అంతర్గతంగా అధికారులు కసరత్తు ఆరంభించారు. వీటికి కూడా ఆరునెలలోపే అంటే జూలైలోగా ఎన్నికలు ఉండొచ్చని పైస్థాయి నుంచి సంకేతాలు అందడంతో ఓటర్ల జాబితాతో పాటు ఆయా మండలాల్లో రెగ్యులర్ ఎంపీడీవోలను భర్తీ చేస్తున్నారు. జడ్పీ ఎన్నికల నిర్వహణలో ఎంపీడీవోల పాత్ర కీలకం కావడంతో ఈ దిశగా ఇప్పటికే నియామకాలు జరుగుతున్నాయి. సిబ్బంది సర్దుబాటుపైనా అధికారులు దృష్టిసారించారు.ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఉన్న ఆస్తులు ఎంతనేది ఇప్పటికే లెక్క తేల్చారు.మూడు జిల్లాల్లో ఎక్కడిక క్కడ జడ్పీకి భవనాలు,అద్దెల రూపంలో వచ్చే ఆదాయం ,స్థలాలు గుర్తించి నివేదికలు సిద్ధం చేశారు.

రాజ్యాంగంపై పోటీలు

జిల్లా నుంచి అసెంబ్లీ వీక్షణకు ముగ్గురు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది జిల్లాలోని ముగ్గురు విద్యార్థులకు అరుదైన అవకాశం దక్కనుంది. రాష్ట్ర శాసనసభ, పనితీరు, కార్యక్రమాలను వీక్షించడానికి అమరావతి వెళ్లనున్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు కసరత్తు ఆరంభించారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతులు భవిష్యత్తుకు కీలకమలుపుగా చెబుతారు. దీంతో ఆ స్థాయి నుంచే రాజ్యాంగం గురించి తెలియజేయాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం సంకల్పించింది.జిల్లాలో ఆ మూడు తరగతుల్లో సుమారు 60వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు రాజ్యాంగంపై వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలను నిర్వహిస్తారు. వీటిని అక్టోబరు 30వ తేదీకి పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే పలు పాఠశాలల్లో వీటిని మొదలుపెట్టారు. వడపోత తర్వాత చివరికి ముగ్గురిని ఎంపిక చేస్తారు. వాళ్లను అమరావతి అసెంబ్లీ వీక్షణకు పంపిస్తారు. ఎంపిక అనంతరం కార్యాచరణపై ఆదేశాలు వెలువడాల్సి ఉందని విద్యాధికారులు చెబుతున్నారు.

గత డీఎల్‌పీవో చంద్రశేఖర్‌కు 2 ఇంక్రిమెంట్లు నిలిపివేత

రాజమహేంద్రవరం రూరల్ అక్టోంబరు 22(ఆంధ్రజ్యోతి): గతంలో రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ అధికారిగా పనిచేసి.. ప్రస్తుతం పాడేరు జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న కేపీ చంద్రశేఖర్‌కు రెండు యాన్యువల్ ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో రాజమహేంద్రవరం డీఎల్‌పీవోగా పనిచేసిన కాలంలో రూరల్ మండల పరిధిలోని బొమ్మూరు,కాతేరు, హుకుంపేట, పిడింగొయ్యి గ్రామాల పరిధిలో అవకతవకలకు పాల్పడినట్టు విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఈ వ్యవహారంపై పలుమార్లు విచారణ చేపట్టి నివేదికలు సమర్పించారు.ఈ మేరకు క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్టు ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కెపీ చంద్రశేఖర్‌తో పాటు అప్పటి పిడింగొయ్యి పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబుకు ఒక ఇంక్రిమెంట్ నిలుపుదల చేశారు.మరో 8 మంది పంచాయతీ అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టనున్నట్టు తెలిసింది





రాజమహేంద్రవరంలో వాన నీటితో నిండిన రహదారులు

నిండు వాన

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో భారీ వర్షం కురిసింది, బుధవారం ఉదయం ఎండ కాసినప్పటికి మధ్యమధ్యలో మబ్బులో వాతావరణం కనిపించింది. అక్కడక్కడా జల్లులుగా వర్షం కురిసింది. సాయంత్రం 5:30 గంటలకు వర్షం ప్రారంభమై రాత్రి 8గంటల వరకు పడింది. కుండపోత మాదిరిగా వర్షం కురియడంతో నగ రంలో కంబాలచెరువు, తాడితోట డౌన్, వైజంక్షన్, ఆర్‌టీవో ఆఫీస్ రోడ్డు, కోరుకొండ రోడ్డు, పేపరుమిల్లు రోడ్డు ,రామచంద్రరావు పేట తదితర ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్డెక్కింది. 45 నిమిషాల తర్వాత వర్షం చినుకుచినుకుగా పడడంతో నీరు లాగింది. సాయంత్రం వర్షం ప్రారంభం కావడంతో స్కూల్స్, కళాశాల నుంచి ఇళ్లకు చేరుకునే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

రానున్న 24 గంటల్లో.. భారీ వర్షాలు : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో గోదావరి తీర ప్రాంత, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. దక్షిణ తూర్పు అరేబియా సముద్రంలో ఏర్పడిన తీవ్ర ఆవర్తనం, తమిళనాడు తీరానికి సమీపంలో దక్షిణ పశ్చిమ బంగాళాఖాతంలో కొనసాగుతున్న బలమైన తక్కువ పీడన ప్రాంతం కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. వర్షపాతం తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ తీగలు తెగిపడడం, చెట్లు కూలడం వంటివి జరుగుతాయని.. ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్య వేక్షిస్తున్నామన్నారు. వర్షాల నేపథ్యంలో అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దన్నారు.



ఆర్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆషా, ఐఎంఏ ప్రతినిధులు

ఆసుపత్రుల బకాయిలు చెల్లించాలని ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ బకాయిలు తక్షణమే చెల్లించాలని ప్రైవేట్ నెట్‌వర్కు ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆషా రాష్ట్ర అధ్యక్షుడు కె.విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్కు ఆసుపత్రులకు దాదాపు రూ.3 వేల కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని..వీటిలో సీఎంఎఫ్ఎస్‌లో ఉన్న రూ.670 కోట్లను వెంటనే చెల్లించాలని కోరుతున్నామన్నారు. మిగిలిన బకాయిలను రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నిర్ణీత గడువులో చెల్లించాలని అడుగుతున్నామన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న యూనివర్శల్ హెల్త్ స్కీమ్‌లో తమను భాగస్వాములని చేయమని కోరుతున్నామన్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈనెల 10వ తేదీ నుంచి అత్యవసర సేవలు సైతం నిలిపివేశామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో నుంచి రూ.250 కోట్లు ఇస్తామని, మహాధర్నా ఆపేయమని మంగళవారం సాయంత్రం సమాచారం వచ్చిందని, దీనికి సభ్యులు ఒప్పుకోలేదన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో గురువారం మహాధర్నా చేపడతామని వెల్లడించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు పి.విజయభాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. నెట్‌వర్కు ఆసుపత్రుల సమస్యలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, ఇది సరికాదన్నారు. తమకు పావలా ఇస్తూ, రెండు రూపాయల పని చేయించుకుంటున్నారన్నారు. ఈ ధర్నాలో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స



రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో బుధవారం కొత్తపేటకు చెందిన ఒక వృద్ధురాలికి అరుదైన శస్త్ర చికిత్స చేశారు. మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సమీరాజా నేతృత్వంలోని వైద్యబృందం ఆమె పొత్తి కడుపులో ఉన్న 10 కిలోల బరువైన ట్యూమర్‌ను తొలగించారు. జీజీహెచ్‌లో గతేడాదికాలంలో 150 మందికి పైగా రోగులకు కీమోథెరపీ చికిత్స విజయవంతంగా అందించామని మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సమీరాజా, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ స్పందన తెలిపారు. జిల్లా ప్రజలు క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సకు ప్రభుత్వ బోధనాసుపత్రిలో చేరాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు.

సీతానగరం సొసైటీల్లో ఎరువుల అమ్మకాలు నిలిపివేత

సీతానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం మండలంలోని పలు సొసైటీల్లో ఎరువుల అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేశామని ఏడీఏ శశిబిందు తెలిపారు. ములకల్లంక ,మిర్తిపాడు,రఘుదేవపురం సొసైటీలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టరు, బిల్లు బుక్స్, ఈ పోస్ మిషన్ బ్యాలెన్స్ తేడా రావడంతో ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలని ఆయా సొసైటీల సీఈవోలకు సూచించారు. ములకల్లంక సొసైటీలో రూ.2.11 లక్షలు, మిర్తిపాడు సొసైటీలో రూ.21.18 లక్షలు, రఘుదేవపురం సొసైటీలో రూ.9.40 లక్షల ఎరువుల అమ్మకాల రికార్డులు సరిగా లేకపోవడంతో అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. ఆయా సొసైటీల్లో ఎటు వంటి అవకతవకలు జరగలేదని..రికార్డుల్లో పొందుపర్చడంతో జాప్యం జరిగిందని వాటిని సరిచేయాలని ఆదేశించడం జరిగిందన్నారు.

నాలుగు హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం : ఎమ్మెల్యే



కొవ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నాలుగు హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.44 లక్షలు మంజూరైనట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మధ్యలో నిలుపుదల చేసిన నాలుగు హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. కొవ్వూరు మండలంలో 1, చాగల్లు మండలంలో 1, తాళ్లపూడి మండలంలో రెండు హెల్త్ క్లినిక్‌లు గాను ఒక్కొక్క క్లినిక్‌కు రూ. 36 లక్షలు మంజూరయ్యాయన్నారు. అలాగే ఏపీఎంఐపీహెచ్‌ఎం (గ్రాంటు ద్వారా తాళ్లపూడి మండలం పెద్దేవంలో హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ. 55 లక్షలు మంజూరయ్యాయన్నారు. హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ.42 లక్షలు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరైనట్టు ఎమ్మెల్యే తెలిపారు.

పట్టణంలో ఆధార్ స్పెషల్ క్యాంపులు

కొవ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలో ఈనెల 23వ తేదీ నుంచి 30 వరకు విజయవాడ జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. 23వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం, 24వ తేదీన మద్దిపట్లవారివీధి సచివాలయం- 3, 25వ తేదీన ఎన్‌టీఆర్ హౌస్ 1-2 సచివాలయాలు 7-8, 27వ తేదీన ఇందిరమ్మకాలనీ సచివాలయం 9, 28వ తేదీన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, 29వ తేదీన ప్రభుత్వ బాలుర హైస్కూల్ ప్రాంగణం, 30వ తేదీన పండిత మదన మోహన మాలవ్య మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణాలలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఆధార్ శిబిరాలు కొనసాగుతాయన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొవ్వూరులో వర్షం

కొవ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో బుధవారం వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. చల్లటి గాలులు వీచాయి. మధ్యాహ్నం 3-30 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. దీంతో జనజీవనం స్తంభించింది. వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు చేరి ముంపునకు గురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడారు. వాతావరణ హెచ్చరికలతో నదీ తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. గోదావరి నదీ పరివాహక ప్రాంత అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, తీర ప్రాంతాలలో అవసరమైన చోట తక్షణ రక్షణ చర్యలు చేపట్టేలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



మెయిన్‌రోడ్‌లో కురుస్తున్న వర్షం

దేవరపల్లి రామాలయం వద్ద అన్నదానం



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పల్లపువీధి రామాలయం వద్ద బుధవారం కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఉండ్రు అనిల్, మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, సొసైటీ చైర్మన్ ఉప్పులూరి రామారావు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

కొవ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 23వ తేదీన రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే రక్తదాన శిబిరంలో యువతీ, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు.

కార్తీకమాసం సందడి

• ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు • పుణ్యస్నానాలకు గోష్పాదక్షేత్రానికి వేకువజాము నుంచే మహిళల రాక



బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు, భక్తులు

కొవ్వూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం ప్రారంభం కావడంతో బుధవారం గోదావరి తీరంలోని పలు క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మొదటి రోజు వేకువజాము నుంచి పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధికసంఖ్యలో గోష్పాదక్షేత్రానికి వచ్చి పవిత్ర స్నానాలు ఆచరించారు. అలాగే ప్రధాన స్నాన ఘట్టాలలో ఉన్న శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి దొప్పలలో కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో విడిచిపెట్టారు. క్షేత్రంలోని రావిచెట్టు, తులసికోట, సుందరేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజ స్తంభం, నందీశ్వరుని వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు చేశారు. పండితులకు సాలగ్రామ, దీపదానాలను సమర్పించారు. క్షేత్రంలోని ఆలయాలతో పాటు కొవ్వూరు పట్టణం, మండలంలోని అన్ని గ్రామాలలోని శైవక్షేత్రాలన్నీ భక్తుల రద్దీతో కనిపించాయి. క్షేత్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.



పూజలో పాల్గొన్న మహిళలు



రాధాకృష్ణులకు పూజలు చేస్తున్న రమణ కృష్ణదాస్, తదితరులు

గౌడీయామఠంలో గోవర్ధన పూజ

శ్రీరామానంద గౌడీయామఠంలో గోవర్ధన పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరి పర్వతాన్ని ఎత్తిన రోజును పురస్కరించుకుని మఠాధిపతి భక్తి విజ్ఞాన వామన మహారాజ్ ఆధ్వర్యంలో అన్నకూట మహోత్సవం, గోవర్ధనపూజ, గోపూజ మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాధాకృష్ణులకు ప్రత్యేక అభిషేకాలు, హారతులు అందించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గౌడీయామఠ సభ్యులు రమణ కృష్ణదాస్, డీఆర్‌సీఎస్ శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నడపాలి

ఉండ్రాజవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సును వేలివెన్ను, కాల్దరి, పసలపూడి, సూర్యారావుపాలెం మీదుగా తాడేపల్లిగూడెం నకు నడపాలని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ పాషాహుస్ బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. నిడదవోలులో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నందున తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రి వెళ్లే బస్సులు ఇటు తణుకు, ఉండ్రాజవరం, కానూరు మీదుగా వెళుతున్నాయన్నారు. కొత్త రూటుగా బస్సు వేయకపోయినా.. నిడదవోలులో బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు రాజమండ్రి నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే బస్సులు మునిపల్లి నుంచి వేలివెన్ను, సూర్యారావుపాలెం, దువ్వ నుంచి తాడేపల్లిగూడెం వెళ్లడం వల్ల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పాషాహుస్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.

దమ్మెన్నులో రోగులకు ఉచిత నేత్ర పరీక్షలు

ఉండ్రాజవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దమ్మెన్ను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్కోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న 46 మందికి ఉచితంగా పరీక్షలు జరిపి మందులను అందజేశారు. వీరిలో 8 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. వీరికి ఆపరేషన్ నిమిత్తం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి పంపించినట్టు సంస్థ ప్రతినిధి జి. ఆజర్ తెలిపారు. అలాగే 16 మందికి కళ్లజోళ్లు అవసరం కాగా, వారికి రాయితీపై పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపర్తి సత్యనారాయణ, సంస్థ నాయకులు పాల్గొన్నారు.



దమ్మెన్నులో రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సమాజ సేవలో పోలీసులది కీలకపాత్ర



కళాశాలలో మాట్లాడుతున్న సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు

నిడదవోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో పోలీసులది కీలకపాత్ర అని సమిశ్రగూడెం ఎస్ఐ వి.బాలాజీ సుందరరావు అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ పరిధి వికాస్ విద్యాసంస్థల్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు



ఉనకరమిల్లిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న దృశ్యం

నిడదవోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల శివ రామ హరి ప్రసాద్ అన్నారు. బుధవారం ఉనకరమిల్లిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మీసాల కోటేశ్వరరావు, కనక దుర్గారావు ఆర్థిక సహకారంతో 80 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దారపురెడ్డి ప్రదీప్, ట్రెజరర్ గుంటుపల్లి సత్యసాయి, కోసూరి అప్పారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు పాల్గొన్నారు.

నేడు పాలకొల్లులో ధర్నా

నిడదవోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పాలకొల్లు బొమ్మల సెంటర్‌లో గురువారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బయ్యే మసీంద్ర పిలుపునిచ్చారు. దీనికి నిడదవోలు నియోజకవర్గ బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

అయ్యప్పకు ఘనంగా అభిషేకాలు

తాళ్లపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా బుధవారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. తాళ్లపూడి శ్రీధర్మశాస్త అయ్యప్ప పీఠం నిర్వాహకుడు లకంసాని వరప్రసాద్ (జేకరి చిన్నా) గురుస్వామి ఆధ్వర్యంలో అర్చకుడు చేబోలు సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షణలో శ్రీ ధర్మశాస్త అయ్యప్ప పీఠం నుంచి 18 మంది కన్నె స్వాములతో 18 కలశాలతో గోదావరి జలాలు, పంచామృతాలతో ఏకాదశ వార అభిషేకాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్ప విగ్రహాల ఊరేగింపు

దేవరపల్లి: దేవరపల్లిలో అయ్యప్పస్వామి మాలలు ధరించిన భక్తులు బుధవారం ఆలయం వద్ద నుంచి గ్రామంలోని అన్ని వీధుల్లో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్చారు.

వాచ్‌మన్ అనుమానాస్పద మృతి



ఏలూరు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒక హాస్టల్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన గుంగుల బాబూరావు (62) నిడదవోలులోని హెల్గోన్ హాస్టల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తాను ఈ బాధను భరించలేనని, బతకనంటూ మూడు రోజుల క్రితం తన బంధువులకు చెప్పినట్టుగా చెప్పారు. అయితే మూడు రోజుల క్రితం అదృశ్యం అయిన బాబూరావు ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి దగ్గరలో ఆటోనగర్ ఫేజ్-1 జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు పక్కన పొదల్లో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. అతని మెడపైన తాడుతో బిగించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ బి. నాగబాబు తన సిబ్బందితో బుధవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని బంధువులు బుధవారం రాత్రి ఏలూరు వచ్చి మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించి గుర్తించారు.

గోవర్ధనగిరి పర్వతానికి ప్రత్యేక పూజలు

దేవరపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో వేంచేసి ఉన్న రాధాగోపినాథ్ మందిరంలో బుధవారం శ్రీకృష్ణుడు చిటికెన వేలితో గోవర్ధన పర్వతం ఎత్తిన రోజు సందర్భంగా స్వామి వారికి, గోవర్ధన పర్వతానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణుల విగ్రహాలకు అభిషేకాలు చేశారు. వివిధ వంటకాలతో గోవర్ధనగిరి ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా గీతాపారాయణ బృందం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు సాయికృష్ణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పలపాటి కోటేశ్వరరావు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



దేవరపల్లి గీతామందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పాఠశాలలో ఆర్‌వో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

తాళ్లపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపేట ఎంపీపీ స్కూల్‌కు దాతలు ఇచ్చిన ఆర్‌వో వాటర్ ఫిల్టర్‌ను ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ బుధవారం ప్రారంభించారు. ఎంఈవో బాలామణి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల కోసం స్థానిక నాయకులు ఇంజరపు వెంకట కృష్ణ, సత్యనారాయణ, పాఠశాల పూర్వ విద్యార్థి పాతూరి ఆదిత్య ప్రదానం చేశారన్నారు. అలాగే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జీవీకే ప్రసాద్ తన సొంత నిధులతో పాఠశాలలో డైనింగ్ టేబుల్‌ కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, టీచర్లు, పలువురు గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌వో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ

స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

తాళ్లపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌ఫోన్ వినియోగాన్ని విద్యార్థులు సైబర్ క్రైమ్‌లకు, సోషల్ మీడియా కేసుల్లో ఇరుక్కోవద్దని ఎస్ఐ టి. రామకృష్ణ హెచ్చరించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం అన్నదేవరపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ చట్టాలపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరి మృతి



మృతుడు జాలపర్తి రాజు (ఫైల్)

దేవరపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడటంతో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన బుధవారం పల్లంట్లలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లంట్లకి చెందిన జాలపర్తి రాజు (37) అదే గ్రామానికి చెందిన నెరుసు మోహనరావు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం 7.15 నిమిషాలకు ఇంటి నుంచి బయలుదేరి మోహన్‌రావు బేస్ పెద్ద వద్ద ఉన్న ట్రాక్టర్‌ను వేసుకుని కలివేటర్‌తో పొలంలో దుక్కుదున్నేందుకు వెళ్తుండగా, లక్ష్మీపురం శివారులో ప్రమాదవ శాత్తు ట్రాక్టర్ తిరగబడటంతో ఇంజన్ కింద రాజు పడి ఉండిపోయాడు. చుట్టుపక్కలు ఉన్న కూలీలు గమనించి ట్రాక్టర్ కిందపడిన రాజును బయటకు తీయగా, అప్పటికే రాజు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

కొవ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వాడపల్లిలో గోదావరి ఏటిగట్టు కింద స్థలంలో బుధవారం పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సీఐ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఇందులో వారి వద్ద నుంచి రూ. 21,640 నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

కన్నేసి.. కాటేసి!

• తునిలో బాలికపై ఘోరం

• తాతయ్య వరసయ్యే వృద్ధుడు కాటేసిన వైనం

• ఆస్పత్రి పేరుతో బాలికను పాఠశాల నుంచి తీసుకువెళ్లిన నిందితుడు

• తొండంగిలో ఓ తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం.. ఆనక స్కూల్లో దించేసి ఇంటికి..

• వీడియో వైరల్ అవడంతో విషయం తెలిసి నిందితుడిని చితకబాదిన బంధువులు

• బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి అత్యాచారంగా నిర్ధారణ

• నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు: పోక్సో, అత్యాచారం, కిడ్నాప్ కేసులు నమోదు

దారుణం.. అమానుషం.. మాటల్లో చెప్పలేని ఘోరం.. మాయమాటలు చెప్పి అభం శుభం ఎరుగని బాలికపై అత్యాచారం.. తాతయ్య వరుసయ్యే దగ్గర బంధువే అఘాయిత్యానికి ఒడిగట్టిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా చేసింది..



నారాయణరావును పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

(కాకినాడ/తుని/రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ శివారులో ఓ గురుకుల పాఠశాలలో ఓ బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. కొంతకాలం కిందట బాలిక తండ్రి మరణించారు. దీంతో ఆర్థికకష్టాలు చుట్టుముట్టడంతో ఆమెను చదువు మాన్పించేయాలని అనుకున్నా.. ఆ పని చేయలేక తల్లి గురుకుల పాఠశాలలో చేర్పించింది. వీరికి దగ్గరి బంధువైన తుని పట్టణంలో రెండో వార్డుకు చెందిన తాటిక నారాయణరావు (62) బాలికపై కన్నేశాడు. మాయమాటలు చెప్పి గురుకుల పాఠశాల యాజమాన్యాన్ని తాను బాలిక తాతయ్యగా నమ్మించాడు. అనేకసార్లు పాఠశాలకు వచ్చి బాలికను ఆస్పత్రిలో చూపించాలంటూ స్కూల్ నుంచి తీసుకువెళ్లేవాడు. తాతయ్య కావడంతో పాఠశాల సిబ్బంది కూడా అనుమానం రాలేదు. ఎప్పటిలా అతడు మంగళవారం ఉదయం 11 గంటలకు స్కూలుకు వచ్చి బాలికను బయటకు తీసుకువెళ్లాడు. అనంతరం ఆమెకు తినుబండారాలు కొనిచ్చాడు. తనంటే ఇష్టం ఏర్పడేలా చేసుకున్నాడు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు తొండంగి మండలం పైడికొండ గ్రామ శివార్లలోని సపోటా తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కేకలు వేయడంతో అక్కడే ఉన్న ఓ రైతు గమనించి అక్కడికి వచ్చాడు. నువ్వెవరు.. స్కూలు పిల్లను తోటలోకి తీసుకువచ్చి ఏం చేస్తున్నావంటూ నిలదీశాడు. అత్యాచారం చేసిన సదరు నిందితుడు రైతుపై ఎదురుతిరిగాడు. దీంతో రైతు మరింత ఆగ్రహంతో నువ్వు ఇలాంటి పనులు చేస్తున్నావా.. ఎవరూ లేని ఈ తోటలోకి తీసుకువచ్చి బట్టలు విప్పి ఏం చేస్తున్నావ్.. అంటూ గద్దించాడు. దీంతో నిందితుడు మరింత ఎదురుతిరిగి నేను మున్సిపల్ కౌన్సిలర్‌ను అంటూ గట్టిగా మాట్లాడాడు. ఇదే తోటలోకి అనేకసార్లు తీసుకువచ్చి ఇక్కడ ఏం చేస్తున్నావు అంటూ రైతు మళ్లీ నిలదీయడంతో.. నేను పాదు చేశానా.. అమ్మాయి బాత్‌రూంకి అంటే తీసుకువచ్చా అంటూ బుకాయించాడు. బట్టలు విప్పి ఏంచేస్తున్నావ్ అని గద్దించి పోలీసులకు ఫోన్ చేస్తా అని రైతు మరింత నిలదీయడంతో తాతయ్యను అవుతాను.. బాత్‌రూంకు తీసుకువచ్చాను అంటూ సమాధానం ఇచ్చాడు. తర్వాత గుట్టుగా బాలికను గురుకుల పాఠశాలలో దించేసి ఏం ఎరుగనట్టు తునిలో తన ఇంటికి వెళ్లిపోయాడు.

వైరల్ అవడంతో..

తోటలో బాలికతో సదరు నిందితుడు ఉన్న వీడియోలను కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవిశాస్త్ర క్షణాల్లో వైరల్ అయ్యాయి. దీంతో విషయం బాలిక కుటుంబీకులు, బంధువులకు తెలిసింది. దీంతో వారంతా సదరు నిందితుడి ఇంటికి వెళ్లి నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో వారంతా సదరు నిందితుడికి మంగళవారం రాత్రి దేహశుద్ధి చేసి తుని రూరల్ పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత బుధవారం ఉదయం గురుకుల పాఠశాల ఎదుట బాలిక బంధువులు ఆందోళనకు దిగారు. బాలికను పదేపదే నిందితుడితో ఎలా పంపిస్తారని పాఠశాల సిబ్బందిని నిలదీశారు. కాసేపటికి పోలీసులు రావడంతో వారిని కూడా నిలదీశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సాయంత్రం బాలికకు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు అత్యాచారం జరిగినట్టు నిర్ధారించారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు తుని రూరల్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు తుని రూరల్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 250/2025 కింద యూ/ఎస్ 137 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ప్రిన్సిపాల్ వివరణ..

ఈ ఘటనపై గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగజ్యోతి మాట్లాడుతూ తాను పాఠశాలలో కొత్తగా విధుల్లో చేరడం వల్ల ఎప్పటి నుంచి కొనసాగుతున్న ఉపాధ్యాయుల ప్రమేయం మేరకు బాలిక బయటకు వెళ్లడంకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు.

రాజమహేంద్రవరంలో బాలికల హాస్టల్ వార్డెన్ సస్పెండ్

• కలెక్టర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సంక్షేమ బాలికల వసతిగృహానికి చెందిన విద్యార్థినిపై అత్యాచార సంఘటన నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్య వైఖరి నిర్ధారణ కావడంతో హాస్టల్ అధికారిణి ఉమాదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. బంధువుల వివరాలు, గుర్తింపు నిర్ధారించుకోకుండానే పిల్లలను బయటకు పంపరాదని స్పష్టం చేశారు. వార్డెన్లు, సిబ్బంది సంపూర్ణ బాధ్యతతో అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. వసతిగృహాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

వసతి గృహం విద్యార్థినిపై అఘాయిత్యం దారుణం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సాంఘిక సంక్షేమ వసతిగృహంలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అమానుషం చాలా దారుణమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. తూ ర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ విచారణ జరిపించి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. బాలికపై అమా నుషం చేసిన ఆకాష్‌ను అతడికి సహకరించిన మరొక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారి పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారని చెప్పారు. వసతిగృహాల వద్దకు తల్లిదండ్రులను తప్ప ఎవ్వరినీ అనుమతించకూడదని, ఎవరైనా వస్తే సరైన ఆధారాలు ఉంటేనే అనుమతి విషయంలో ఆలోచించాలని కోరారు.